
E-KABURU E-PAPER
# ఈ-కబురు
ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం
@ekaburu.com
(తేదీ) 26-07-2025 (వారం) శనివారం
హైదరాబాద్ పేజీలు–6
e-kaburu.com



కొవిడ్ బాధితుల మెదళ్లకు ముందుగానే ముసలితనం » 3లో

# ఓబీసీల కోసం ప్రత్యేక ప్రణాళిక



- ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే
- సంక్షేమ ఫలాలు అందించడమే కాంగ్రెస్ పార్టీ ప్రధాన లక్ష్యం
- బీసీనని చెప్పుకునే మోదీ 11 ఏళ్లలో బీసీలకు చేసిందేమీ లేదు
- ఓబీసీల కోసం ఇక రెట్టింపు వేగంతో పని చేయబోతున్నా: రాహుల్‌గాంధీ
- తెలంగాణలో చేసిన కులగణన ఓ రాజకీయ భూకంపమని వ్యాఖ్య
- ఏఐసీసీ ఓబీసీ విభాగం 'భాగీదారీ న్యాయ సమ్మేళనం'లో నేతలు

ఈ కబురు, న్యూఢిల్లీ: ఓబీసీల అభ్యున్నతి, సంక్షేమం కోసం కొత్త పథకాలు తీసుకురావాలని అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులను కోరినట్లు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తెలిపారు. వెనుకబడిన వర్గాల వారికి సంక్షేమ ఫలాలు అందజేయడమే కాంగ్రెస్ పార్టీ ప్రధాన లక్ష్యమన్నారు. ఓబీసీలను అభ్యున్నతి వైపు ఎలా ముందుకు తీసుకెళ్లాలనే దానిపై పార్టీ ఆధ్వర్యంలో ఒక నక్షా (ప్రణాళిక) సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు. విభజించి పాలించడమే మోదీ ప్రభుత్వ విధానమని దుయ్యబట్టారు. తాను బీసీనని చెప్పుకుంటున్న ప్రధాని మోదీ గడచిన 11 ఏళ్లలో ఓబీసీల కోసం చేసిందేమీ లేదని విమర్శించారు. శుక్రవారం ఢిల్లీలోని తాల్కటోరా స్టేడియంలో ఏఐసీసీ ఓబీసీ విభాగం నిర్వహించిన 'భాగీదారీ న్యాయ సమ్మేళనం'లో ఆయన మాట్లాడారు.

**ఆర్ఎస్ఎస్, బీజేపీ విషం లాంటివి..**

'తెలంగాణలో ప్రతి సామాజిక వర్గానికి సంబంధించి ఒక నివేదిక తయారు చేశారు. కర్ణాటకలో కూడా చేస్తున్నారు. దాని ఆధారంగా వారికి పథకాలు రూపొందిచాలని ముఖ్యమంత్రులకు సూచించాం. సంక్షేమ ఫలాలు అందేలా చూడాలని కోరాం. తెలంగాణ, కర్ణాటక సర్వేల్లో అగ్రకులాలకు చెందినవారు 5, 10 శాతం ఉన్నారని తెలుస్తోంది. వీళ్లే ప్రభుత్వాల ఏర్పాటులో కీలక పాత్ర పోషిస్తున్నారు. ఎందుకంటే వీళ్ల దగ్గర విద్య, మానసిక బలం ఉంది. ఆర్ఎస్ఎస్, బీజేపీ విషం లాంటివి. ఆ విషాన్ని ఒక్కసారి రుచి చూద్దామనుకుంటే చనిపోతారు. ఓబీసీ కులగణన చేయాలని మొట్ట మొదటిసారిగా రాహుల్‌గాంధీ చెప్పారు. గతంలో ఎవరూ చెప్పలేదు. అలాంటి రాహుల్‌గాం దీకి మద్దతిస్తారా? లేక దేశాన్ని ముక్కలు చేసేవారికా? ఆలోచించుకోవాలి..'అని ఖర్గే అన్నారు.

తరువాయి 2లో

# ఇందిరా గాంధీ రికార్డును అధిగమించిన మోదీ

ప్రధాని నరేంద్ర మోదీ మరో ఘనతను సాధించారు. అత్యధిక కాలంపాటు పదవిలో కొనసాగిన రెండో ప్రధానిగా ఇందిరాగాంధీ..

- ప్రధానిగా 4,078 రోజుల పాటు పదవిలో
- పీఎంవీబీఆర్‌వై ఆవిష్కారం.. ఆగస్టు 1 నుంచి అమల్లోకి
- ఉద్యోగాల కల్పనకు కేంద్రం ప్రోత్సాహకాలు




తరువాయి 2లో

# మాల్దీవులకు రూ.4,850 కోట్ల రుణం



ఈ కబురు: మాలే: బ్రిటన్ నుంచి శుక్రవారం మాలే చేరుకున్న భారత ప్రధాని మోదీకి మాల్దీవుల అధ్యక్షుడు మొహమ్మద్ ముయిజ్జు ఘనస్వాగతం పలికారు. పరస్పర విశ్వాసమే ప్రాతిపదికగా భారత్, మాల్దీవుల మైత్రి సాగుతోందని ముయిజ్జుతో ద్వైపాక్షిక సంప్రదింపుల సందర్భంగా మోదీ ప్రకటించారు.

తరువాయి 2లో

# హైటెక్ మండలంలో 'ఆఖరి మజిలీ'కి అరిగోస

**మృతదేహానికి బండరాయి కట్టి ఖననం..**

**చెప్పులు చేతుల్లో పట్టుకొని ఒక్కో అడుగు వేస్తూ పాడే మోయాల్సిందే...**


**అంజయ్య నగర్ స్మశాన వాటికలో వసతులు లేక స్థానికుల ఇబ్బందులు**

**నీటి మూ(ఊ)టగా మారిన ప్రజాప్రతినిధుల 'దత్తత'**




ఖననం చేసేందుకు తీసిన గుంతలో చేరిన ఊట వరద నీరు

ఈ-కబురు, శేరిలింగంపల్లి : " వర్షా కాలంలో అక్కడ అంతిమయాత్ర చేయాలంటే చెప్పలు చేతుల్లో పట్టుకొని జాగ్రత్తగా అడుగులో అడుగు వేస్తూ పాడే మోయాల్సిందే... మృతదేహాన్ని ఖననం చేసే బొందలో మృతదేహంతో పాటు ఓ బండరాయిని కట్టాల్సిందే... ఇదేదో ఆ ప్రాంత ఆచారం అనుకుంటే బురదలో కాలేసినట్లే.. వర్షా కాలంలో స్థానికంగా ఎవరైనా మరణిస్తే అక్కడి ప్రజలు అంతిమ సంస్కారాల కోసం పడుతున్న ఇబ్బందులకు నిదర్శనం... ఇదేదో మారుమూల పల్లెటూరు కాదు... ఓవైపు మాదాపూర్, మరోవైపు గచ్చిబౌలి ఐటీ కారిడార్ ల మధ్యలో ఉన్న అంజయ్య నగర్ దుస్థితి."



తరువాయి 3లో

ఆ సినిమా పెద్ద హిట్టవుతుందనుకున్నా.. » 5లో



భారీ నష్టాల్లో స్టాక్ మార్కెట్లు.. కుప్పకూలిన బజాజ్ షేర్లు » 4లో



# బీసీల నోటి కాడి బువ్వను కాజేసేందుకు బీజేపీ కుట్రలు



- బీసీ రిజర్వేషన్లు అడ్డుకుంటే సకల జనుల సమ్మెను మించి పోరాటం
- మంత్రులు పొన్నం, కొండా సురేఖ, వాకిటి శ్రీహరి
- ఢిల్లీలో భాగీదారీ న్యాయ సమ్మేళనంలో పాల్గొన్న నేతలు

తరువాయి 2లో

## టెక్స్‌టైల్ రంగంలో పెట్టుబడులు పెట్టండి »2లో



## పొన్నం, మహేశ్‌కు మార్‌లలో ఒకరిని సీఎం చేయండి: రామచందర్‌రావు »3లో



## హెచ్‌సీయూ భూముల్లో సీఎంకు కమీషన్లు

- క్విడ్ ప్రో కో కింద బీజేపీ ఎంపీ సీఎం రమేశ్‌కు రూ. 1,600 కోట్ల కాంట్రాక్టు
- బీజేపీ ఎంపీకి కమీషన్లు ఇస్తుంటే రాహుల్ మౌనం ఎందుకు?
- రాష్ట్రంలో బీజేపీ, కాంగ్రెస్ నడుమ రాజకీయ అక్రమ సంబంధం
- సోనియా ఉత్తరాన్ని అర్థం చేసుకోలేని రేవంత్‌పై జాలి వేస్తోంది



తరువాయి 2లో

బీసీ రిజర్వేషన్లను 2%తగ్గించిన ఘనత రేవంత్‌రెడ్డిదే

# అదో పనికిరాని సర్వే

- తెలంగాణ ప్రభుత్వ కులగణనపై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి
- 42 శాతం రిజర్వేషన్లతో నిజమైన బీసీలు నష్టపోతారు
- మేం కాంగ్రెస్‌లా తూతూమంత్రంగా కాకుండా రాజ్యాంగబద్ధమైన కులగణన చేసి బీసీలకు



ఈ కబురు, న్యూఢిల్లీ: తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహించిన కులగణన సర్వే పనికి రానిదని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వం చెబుతున్న 42 శాతం రిజర్వేషన్లతో నిజమైన బీసీలు నష్టపోతారని ఆందోళన వ్యక్తం చేశారు. రిజర్వేషన్ల విషయంలో డొంకతిరుగుడు ప్రచారంతో సీఎం రేవంత్‌రెడ్డి, ఆ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీలు బీసీలను మభ్యపెడుతున్నారని మండిపడ్డారు. శుక్రవారం ఢిల్లీలో కిషన్‌రెడ్డి విలేకరులతో మాట్లాడారు. తాము రాష్ట్రంలో అధికారంలోకి వస్తే రాజ్యాంగబద్ధమైనవి కాకుండా ఇచ్చిన రిజర్వేషన్లను రద్దు చేస్తామని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ తూతూమంత్రంగా చేసినట్టు తాము దేశవ్యాప్తంగా చేపట్టబోయే కులగణన ఉండదన్నారు. రాజ్యాంగబద్ధమైన కులగణన చేసి, భవిష్యత్‌లో బీసీలకు న్యాయం చేస్తామని చెప్పారు. 42 శాతం రిజర్వేషన్ల పేరుతో ఎంఐఎం పార్టీ, కాంగ్రెస్ పార్టీకి చెందిన షబ్బీర్ అలీ, అజారుద్దీన్ వంటి వారికోసమే రాజకీయ రిజర్వేషన్లు ఇవ్వాలనుకుంటున్నారని ఆరోపించారు. కన్వర్టెడ్ బీసీ అంటూ ప్రధాని మోదీని సీఎం రేవంత్ హేళన చేయడాన్ని ఆక్షేపించారు. మిడిమిడి జ్ఞానంతో సీఎం స్థానంలో ఉండి ఇష్టమొచ్చినట్టు మాట్లాడుతున్నారని మండిపడ్డారు.

తరువాయి 2లో

బిడ్డ కోసం అప్పుడే మొదలు పెట్టేశారు » 5లో



సింధుకు షాక్ » 6లో



మొదటి పేజీ తరువాయి

# ఓబీసీల కోసం ప్రత్యేక ప్రణాళిక



**రాహుల్‌గాంధీ**

ఓబీసీ వర్గాన్ని రక్షించే విషయంలో నేను వెనుక బడ్డా. మీ సమస్యలను ఆ సమయంలో నేను లోతుగా అవగాహన చేసుకోలేదు. 10, 15 ఏళ్ల ముందు దళితులు, ఆదివాసీల సమస్యలను అర్థం చేసుకోగలిగా. కానీ ఓబీసీల సమస్యలను లోతుగా అర్థం చేసుకోలేకపోయా. ఇది కాంగ్రెస్ పార్టీ తప్పు కాదు.. కచ్చితంగా నా తప్పే. ఆ సమయంలోనే కులగణన చేయించి ఉంటే.. ఇప్పుడు నేను చేయించాలనుకున్నట్లుగా ఉండేది కాదు. ఓబీసీల కోసం ముందుగా నేను చేయలేకపోయిన పనిని ఇప్పుడు రెట్టింపు వేగంతో చేయబోతున్నా..'అని లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ తెలిపారు.

**మోదీ అబద్ధాలకు సర్దార్**

'బీసీ అయిన నన్ను కాంగ్రెస్ వాళ్లు వేధిస్తున్నారని ప్రధాని మోదీ పదే పదే అంటున్నారు. మేము కాదు.. మోదీయే అందరినీ వేధిస్తున్నారు. అందరినీ మట్టిలో కలిపేసి ఆయన ఒక్కడే సజీవంగా ఉండాలనుకుంటున్నారు. మోదీజీ ఎప్పుడూ అబద్ధాలే చెబుతారు. ఆయన అబద్ధాలకు సర్దార్. పార్లమెంటులో కూడా అసత్యాలు చెబుతారు. అబద్ధాలు చెప్పే ప్రధాని దేశం, సమాజానికి మంచి చేయలేరు..'అని ఖర్గే ధ్వజమెత్తారు.

**ఓబీసీ వర్గాలను రక్షించుకోవడంలో వెనుకబడ్డా:**

**తెలంగాణ సర్కారు వద్ద న్న డేటాకు తిరుగులేదు..**

'తెలంగాణలో చేసిన కులగణన ఒక రాజకీయ భూకంపం. అది దేశ రాజకీయాలను కుదిపేసింది. దాని తర్వాత పరిణామాలు ఇంకా మీరు చూడలేదు. గతంలో ఒకసారి సునామీ వచ్చింది. రెండు మూడు గంటల తర్వాత దాని ప్రభావం కనిపించింది. అదే తెలంగాణలోనూ జరిగింది. తెలంగాణ ప్రభుత్వం చేతుల్లో ఉన్న డేటాకు దేశంలో ఎక్కడా ఎదురులేదు. ఆ డేటా ఆధారంగా తెలంగాణలోని మొత్తం కార్పొరేట్ సంస్థల్లో ఎంతమంది ఓబీసీలు, దళితులు, ఆదివాసీలు ఉన్నారనేది ఒక్క నిమిషంలోనే చెప్పవచ్చు. అయితే తెలంగాణలో కార్పొరేట్లలో ఎంతమంది ఓబీసీ యజమానులు, దళిత యజమానులు ఉన్నారు? అక్కడ లక్షలు, కోట్ల రూపాయల ప్యాకేజీలు లభిస్తాయి. కానీ ఓబీసీలకు ఎంత ప్యాకేజీ లభిస్తోందని అడిగితే..నేను జీరో అంటాను. అక్కడ దళితులు, ఓబీసీలు, ఆదివాసీల్లో ఎవ్వరికీ ఇలాంటి ప్యాకేజీలు దక్కడం లేదు. దేశంలో దళితులు, ఆదివాసీలు, ఓబీసీలే కూలీ పనిచేస్తారు..'అని రాహుల్ పేర్కొన్నారు.

**ఉత్పాదక శక్తికి గౌరవం దక్కాలి**

'ఏ దేశాన్ని అయినా నడిపించేది ఉత్పదక శక్తే. అలాంటి శక్తికి దేశం ఏం ఇస్తోంది? రోడ్లు, భవనాలు, కాలేజీలు, ఆసుపత్రులు, ఆలయాలు నిర్మించేది మీరే. ఈ పని కోసం దేశం మీకు ఏం ఇస్తోంది? నేను ఏదైనా అనుకుంటే అది సాధించే వరకు ఊరుకోను. కులగణన ఒక్కటే కాదు.. ఉత్పాదక శక్తికి దేశంలో గౌరవం దక్కాలన్నదే నా లక్ష్యం. దేశ ఉత్పాదక శక్తి చరిత్రను ఆర్ఎస్ఎస్, బీజేపీలు కలిసి చెరిపేసే ప్రయత్నం చేశాయి. పాఠ్య పుస్తకాల్లో ఓబీసీల చరిత్ర ఎక్కడుంది? దేశంలో 55, 60 శాతం ఉన్న ఓబీసీల చరిత్రను కావాలనే చెరిపేశారు.ఎప్పుడైతే మీరు మీ చరిత్ర తెలుసుకుంటారో ఆ రోజు ఆర్ఎస్ఎస్ మీ శత్రువు అని తెలుసుకుంటారు. మా ప్రభుత్వాలు ఉన్నచోట ముందుగా కులగణన ఎక్స్‌రే, ఎంఆర్ఐ చేస్తాం. ఓబీసీలు ఎంతమంది ఉన్నారు? ఎక్కడున్నారు? భాగస్వామ్యం ఎంత? అనేది తేలుతుంది. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లోనే కాదు.. జాతీయ స్థాయిలో కుల గణన, 50 శాతం అడ్డుగోడలు పడగొడతాం..'అని కాంగ్రెస్ అగ్రనేత చెప్పారు.

**ఇంగ్లిష్‌తో డబుల్ బ్యారెల్ ప్రోగ్రెస్**

'చదువు ఉన్నవారు వేగంగా అభివృద్ధి చెందుతారని తెలంగాణ సర్వేలో తెలిసింది. విద్యతో పాటు మీ దగ్గర ఇంగ్లిష్ ఉంటే డబుల్ బ్యారెల్ ప్రోగ్రెస్ ఉంటుందని తేలింది. ఇంగ్లిష్‌ను దేశం నుంచి తొలగించేస్తామని బీజేపీ నేతలు చెబుతున్నారు. ప్రాంతీయ భాషలు ఎంతో అవసరం. కానీ దాంతో పాటు ఇంగ్లిష్ కూడా అవసరం. అందుకే మా మూడో నినాదం ప్రైవేట్ విద్యా విధానంలో దళితులకు, ఆదివాసీ, వెనుకబడిన వర్గాలకు రిజర్వేషన్ కల్పించడమే..'అని రాహుల్ చెప్పారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, వాకిటి శ్రీహరి, ఎంపీలు అనిల్‌కుమార్ యాదవ్, సురేష్ షెట్కార్, బీసీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ఎంపీ వి.హనుమంతరావు, కర్ణాటక సీఎం సిద్ధ రామయ్య, రాజస్తాన్ మాజీ సీఎం అశోక్ గెహ్లోట్, ఛత్తీస్‌గఢ్ మాజీ సీఎం భూపేష్ భగేల్ తదితరులు పాల్గొన్నారు.

మొదటి పేజీ తరువాయి

# మాల్దీవులకు రూ.4,850 కోట్ల రుణం



ఈ కబురు: మాలే: బ్రిటన్ నుంచి శుక్రవారం మాలే చేరుకున్న భారత ప్రధాని మోదీకి మాల్దీవుల అధ్యక్షుడు మొహమ్మద్ ముయిజ్జు ఘనస్వాగతం పలికారు. పరస్పర విశ్వాసమే ప్రాతిపదికగా భారత్, మాల్దీవుల మైత్రి సాగుతోందని ముయిజ్జుతో ద్వైపాక్షిక సంప్రదింపుల సందర్భంగా మోదీ ప్రకటించారు. ముయిజ్జు, మోదీలు వాణిజ్య, రక్షణ, మౌలిక సదుపాయాల రంగాల్లో పరస్పర సహకారంపై ద్వైపాక్షిక సంప్రదింపులు జరిపారు. కొంత కాలంగా మసకబారిన మైత్రిని పునరుద్ధరిస్తూ ప్రధాని మోదీ చేపట్టిన ఈ పర్యటనలో భాగంగా మాల్దీవులకు రూ 4,850 కోట్ల రుణాన్ని ప్రకటించారు. మాల్దీవుల వార్షిక రుణ చెల్లింపుల మొత్తాన్ని 40 శాతం మేర కుదించారు. ఈ ప్రకటన ఆర్థిక ఇబ్బందుల్లో కొట్టుమిట్టాడుతున్న మాల్దీవులకు ఎంతో ఊరట కల్పించనుంది. ఇరు పక్షాల పెట్టుబడుల ఒప్పందాన్ని ఖరారు చేసే దిశగా పని చేస్తామని, స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై సంప్రదింపులు ప్రారంభమయ్యాయని ప్రధాని ప్రకటించారు. పొరుగు దేశాలకు మొదటి ప్రాధాన్యతనిస్తూ భారత్ అనుసరిస్తున్న మహాసాగర్ విధానంలో మాల్దీవులది ప్రముఖ స్థానమని మోదీ పేర్కొన్నారు. ''దేశాధ్యక్షుడు ముయిజ్జు నాకు స్వాగతం పలకడానికి విమానాశ్రయానికి రావడం నన్ను కదిలించింది'' అని ప్రధాని అన్నారు. రానున్న రోజుల్లో ఇరు దేశాల మైత్రి గణనీయమైన ప్రగతి సాధిస్తుందన్న నమ్మకం తనకుందన్నారు. తమ దేశాల ప్రతినిధి బృందాలతో కలిసి చర్చలు ప్రారంభించడానికి ముందు ఇరువురు నేతలూ కొంతసేపు ఏకాంతంగా మాట్లాడుకున్నారు. 2023లో అధికారానికి వచ్చిన ముయిజ్జు చైనాతో సంబంధాలు పెంపొందించుకొని ''ఇండియా ఔట్'' విధానాన్ని అనుసరించారు. తాజాగా భారత్, మాల్దీవుల సంబంధాల పునరుద్ధరణను ఒక దౌత్య విజయంగా భావిస్తున్నారు. మాల్దీవుల రక్షణ కార్యాలయంపై మోదీ భారీ చిత్రాన్ని ప్రదర్శించడం ప్రధాని పర్యటనలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

మాల్దీవుల్లో మోదీ.. స్వయంగా ప్రధానిని ఆహ్వానించిన ముయిజ్జు ప్రధాని నరేంద్రమోదీ మాల్దీవులకు వెళ్లారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా శుక్రవారం ఆ దేశంలో ల్యాండ్ అయ్యారు . ఆయనకు అధ్యక్షుడు మహ్మద్ ముయిజ్జు, విదేశాంగ, రక్షణ, ఆర్థిక, హోంశాఖ మంత్రులు విమానాశ్రయానికి వచ్చి స్వాగతం పలికారు. 'ఇండియా ఔట్' నినాదంతో రెండు దేశాల మధ్య సంబంధాలు ఒడుదొడుకులకు గురైన నేపథ్యంలో తాజా పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది.

మాల్దీవులు అధ్యక్షుడిగా మహ్మద్ ముయిజ్జు ఎన్నికైన మొదట్లో.. చైనా అనుకూల విధానాలు అవలంబిస్తూ.. 'ఇండియా ఔట్' నినాదాన్ని తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. ఇందులోభాగంగా మాల్దీవులకు భారత్ అందిస్తున్న సైనిక సాయాన్ని వెనక్కి తీసుకోవాల్సిన పరిస్థితులు తలెత్తాయి. ఈనేపథ్యంలోనే విడతల వారీగా గత మే నాటికి మాల్దీవుల్లోని భారత్ సైన్యం వెనక్కి వచ్చేసింది. అంతేకాకుండా భారత్‌తో కలిసి నిర్వహిస్తున్న ప్రాజెక్టులను కూడా నిలిపివేయాలని మాల్దీవులు నిర్ణయించింది. ముయిజ్జు 'చైనా ఫస్ట్' విధానాన్ని అనుసరించారు. తర్వాత తన నిర్ణయాల ప్రభావం ముయిజ్జుకు త్వరగానే అర్థమైంది. దాంతో మనతో సంబంధాలు మెరుగుపర్చుకోవడానికి మొగ్గు చూపారు. గత ఏడాది మనదేశ పర్యటనకు వచ్చిన ఆయన.. మోదీని మాల్దీవులకు ఆహ్వానించారు.

దీనికిముందు బ్రిటన్ పర్యటనను విజయవంతంగా ముగించారు. రెండు దేశాల మధ్య గురువారం చరిత్రాత్మక స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ) లాంఛనప్రాయంగా కుదిరింది. ఈ ఎఫ్‌టీఏకు అధికారికంగా 'సమగ్ర ఆర్థిక, వాణిజ్య ఒప్పందం (సెటా)'గా నామకరణం చేశారు. దీనిపై మోదీ స్పందిస్తూ.. ''భారత్, బ్రిటన్ సంబంధాల్లో ఇదొక చరిత్రాత్మక రోజు. ఏళ్ల తరబడి చేసిన శ్రమ ఫలితంగా ఇరుదేశాల మధ్య సెటా కుదిరింది'' అని పేర్కొన్నారు. పహల్గాం ఉగ్రదాడిని ఖండించినందుకు బ్రిటన్‌కు మోదీ కృతజ్ఞతలు తెలిపారు. ఉగ్రవాదంపై పోరులో ద్వంద్వ ప్రమాణాలకు తావులేదని స్పష్టం చేశారు.

# టెక్స్‌టైల్ రంగంలో పెట్టుబడులు పెట్టండి



ఈ కబురు,:టెక్స్‌టైల్ రంగం అభివృద్ధికి ఇతర రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణలో అపారమైన అవకాశాలున్నాయని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి. శ్రీధర్‌బాబు అన్నారు. ఇక్కడ పెట్టుబడులు పెట్టి 'రైజింగ్ తెలంగాణ'లో భాగస్వామ్యం కావాలని తైవాన్ పారిశ్రామికవేత్తలను కోరారు. శుక్రవారం సచివాలయంలో తైవాన్ టెక్స్‌టైల్స్ ఫెడరేషన్ (టీటీఎఫ్) అధ్యక్షుడు జస్టిన్ వాంగ్ నేతృత్వంలో 11 మంది ప్రతినిధుల బృందం మంత్రి శ్రీధర్‌బాబును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "స్వల్ప కాలంలోనే టెక్స్‌టైల్ రంగంలో తెలంగాణ ఇతర రాష్ట్రాలకు దీటుగా ఎదిగింది. రాష్ట్ర పారిశ్రామిక జీఎస్‌వీఏ (రాష్ట్ర స్థూల విలువ జోడింపు) 2024-25లో రూ.2.77 లక్షల కోట్లుగా ఉంది.

ఇందులో టెక్స్‌టైల్ రంగం కీలక పాత్ర పోషించింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవతో అభివృద్ధి చేసిన కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు(కేఎంటీపీ) గేమ్ చేంజర్‌గా మారింది. అంతర్జాతీయ భాగస్వామ్యాల ద్వారా తెలంగాణ పారిశ్రామికాభివృద్ధిని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు మా ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోంది" అని మంత్రి శ్రీధర్‌బాబు వివరించారు. తైవాన్ పారిశ్రామికవేత్తలు ముందుకొస్తే 'తెలంగాణ - తైవాన్ మాన్యుఫాక్చరింగ్ జోన్' పేరిట ప్రత్యేక టెక్స్‌టైల్ క్లస్టర్లను అభివృద్ధి చేస్తామన్నారు. కాగా, ఈ-గవర్నెన్స్, హెల్త్ రికార్డుల డిజిటలైజేషన్‌లో ప్రపంచంలోనే అద్భుత ప్రగతి సాధించిన ఎస్తోనియా దేశ సహకారం తీసుకుంటామని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. శుక్రవారం ఎస్తోనియా రాయబారి మ్యారియే లూప్ ఆధ్వర్యంలో ఆ దేశ వాణిజ్య ప్రతినిధులు మంత్రిని కలిశారు. తెలంగాణ ప్రజల ఆరోగ్య రికార్డుల డిజిటలైజేషన్‌లో ఇంకా ప్రథమ దశలోనే ఉందని శ్రీధర్‌బాబు తెలిపారు. వంద శాతం ప్రగతి సాధించిన ఎస్తోనియా తమకు సాంకేతిక సహకారం అందించాలని కోరారు.

మొదటి పేజీ తరువాయి

# బీసీ రిజర్వేషన్లను 2%తగ్గించిన ఘనత రేవంత్‌రెడ్డిదే అదో పనికిరాని సర్వే



కాంగ్రెస్ పార్టీ తూతూమంత్రంగా చేసినట్టు తాము దేశవ్యాప్తంగా చేపట్టబోయే కులగణన ఉండదన్నారు. రాజ్యాంగబద్ధమైన కులగణన చేసి, భవిష్యత్‌లో బీసీలకు న్యాయం చేస్తామని చెప్పారు. 42 శాతం రిజర్వేషన్ల పేరుతో ఎంఐఎం పార్టీ, కాంగ్రెస్ పార్టీకి చెందిన షబ్బీర్ అలీ, అజారుద్దీన్ వంటి వారికోసమే రాజకీయ రిజర్వేషన్లు ఇవ్వాలనుకుంటున్నారని ఆరోపించారు. కన్వర్టెడ్ బీసీ అంటూ ప్రధాని మోదీని సీఎం రేవంత్ హేళన చేయడాన్ని ఆక్షేపించారు. మిడిమిడి జ్ఞానంతో సీఎం స్థానంలో ఉండి ఇష్టమొచ్చినట్టు మాట్లాడుతున్నారని మండిపడ్డారు.

1972లో లంబాడీలను ఎస్టీల్లో చేర్చారు అంటే వారు కూడా కన్వర్టెడ్ ఎస్టీలా అంటూ ప్రశ్నించారు. 1994లో కాంగ్రెస్ పార్టీ గుజరాత్‌లో అధికారంలో ఉన్నప్పుడు మండల్ కమిషన్ నివేదిక ప్రకారమే మోదీ కులాన్ని బీసీల్లో చేర్చారని గుర్తు చేశారు. రాజీవ్‌గాంధీ ఏ సామాజికవర్గానికి చెందిన వారో సీఎం రేవంత్ చెప్పాలన్నారు. తెలంగాణ హైకోర్టు ఆదేశాల ప్రకారం పెంచిన రిజర్వేషన్లతోనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని కిషన్‌రెడ్డి డిమాండ్ చేశారు.వేరేవారికి నీతులు చెప్పే రేవంత్‌రెడ్డి ముందు సీఎం పదవికి రాజీనామా చేసి బీసీని ముఖ్యమంత్రిని చేయాలని సవాల్ విసిరారు. మెట్రో విషయంలో రేవంత్‌రెడ్డి పచ్చి అబద్ధాలు ఆడుతున్నారని మండిపడ్డారు. ట్రైపార్టీ అగ్రిమెంట్ జరగాలన్న అవగాహన కూడా లేకుండా మాట్లాడుతున్నారని, మెట్రోకు వందశాతం కేంద్రం సహకరిస్తుందని స్పష్టం చేశారు. ఉపరాష్ట్రపతి పదవి దత్తాత్రేయకు ఇవ్వాలన్న డిమాండ్‌ను స్వాగతిస్తున్నామన్నారు.

# ఇందిరా గాంధీ రికార్డును అధిగమించిన మోదీ

ఈ కబురు,న్యూఢిల్లీ : ప్రధాని నరేంద్ర మోదీ మరో ఘనతను సాధించారు. అత్యధిక కాలంపాటు పదవిలో కొనసాగిన రెండో ప్రధానిగా ఇందిరాగాంధీ పేరుతో ఉన్న రికార్డును ఆయన శుక్రవారం అధిగమించారు. ఇందిరాగాంధీ 1966 జనవరి 24 నుంచి 1977 మార్చి 24 వరకు ఏకధాటిగా 4,077 రోజుల పాటు పదవిలో కొనసాగారు. ప్రస్తుతం మోదీ శుక్రవారం నాటికి 4,088 రోజుల పదవీ కాలాన్ని పూర్తి చేశారు. ప్రథమ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ ఓటమిని ఎరగకుండా అత్యధిక కాలం పాటు పదవిలో కొనసాగారు. వరుసగా మూడుసార్లు కాంగ్రెస్‌కు విజయం సాధించిపెట్టారు. 1947 ఆగస్టు 15 నుంచి 1964 మే 27 వరకు మొత్తం 6,130 రోజులు పదవిలో కొనసాగారు. ప్రస్తుతం ఆ తర్వాతి స్థానంలో మోదీ ఉన్నారు. పదవిలో కొనసాగుతూ వరుసగా బీజేపీని గెలిపిస్తున్న రాజకీయ నాయకునిగా ఇప్పటికే మోదీ ఘనత సాధించారు. ఆయన 2002, 2007, 2012ల్లో జరిగిన గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించి సీఎంగా బాధ్యతలు నిర్వహించారు. 2014, 2019, 2024 లోక్‌సభ ఎన్నికల్లో గెలిచి ప్రధాని పదవిని చేపట్టారు. ఇంత వరకు ఏ ఎన్నికల్లోనూ ఆయన ఓడిపోలేదు. వరుసగా ఆరు ఎన్నికల్లో విజయం సాధించి సీఎంగా, పీఎంగా కొనసాగిన ఏకైక నాయకుడు మోదీయే కావడం విశేషం. ప్రధానిగా రెండు టర్ములు పూర్తి చేసుకున్న కాంగ్రెసేతర నేత కూడా ఆయనే కావడం మరో విశేషం.




**ఉద్యోగాల కల్పనకు కేంద్రం ప్రోత్సాహకాలు**

కొత్తగా ఉద్యోగాల కల్పనను ప్రోత్సహించేందుకు కేంద్రం నూతన పథకాన్ని ఆవిష్కరించింది. పీఎం వికసిత్ భారత్ రోజ్‌గార్ యోజన (పీఎంవీబీఆర్‌వై) పేరుతో ఉద్యోగ అనుసంధాన ప్రోత్సాహక పథకాన్ని ప్రారంభించినట్టు శుక్రవారం కార్మిక శాఖ తెలిపింది. ఈ పథకం ఆగస్టు ఒకటో తేదీ నుంచి అమల్లోకి రానుందని, వచ్చే రెండేళ్లలో 3.5 కోట్లకు ఉద్యోగాలు కల్పించాలని లక్ష్యంతో ఈ పథకానికి రూ.99,446 కోట్లు కేటాయించినట్టు తెలిపింది. ఇందులో 1.92 కోట్ల మంది మొదటిసారిగా ఉద్యోగం పొందిన వారు ఉండాలని ఆశయంగా పెట్టుకొంది. 2025 ఆగస్టు ఒకటో తేదీ నుంచి 2027 జూలై 31లోగా ఈ ఉద్యోగాలను కల్పించాల్సి ఉంటుంది. కొత్తగా ఉద్యోగాలు పొందినవారితోపాటు ఉద్యోగాలు కల్పించిన యజమానులకూ ప్రోత్సాహకాలు అందించనుండడం ఈ పథకం ప్రత్యేకత. వస్తువుల తయారీ రంగానికి అధిక ప్రాధాన్యం ఇవ్వనుంది. ఈ పథకం పార్ట్‌ఏలో తొలిసారిగా ఉద్యోగాలు పొందిన వారికి, పార్ట్‌బిలో యజమానులకు అందించే ప్రోత్సాహకాలను ప్రస్తావించారు.

తొలిసారిగా ఉద్యోగాలు పొందిన వారు ఈపీఎఫ్‌వోలో పేరు నమోదు చేసుకొని ఉంటే వారికి ఒక నెల ఈపీఎఫ్ వేతనాన్ని ప్రోత్సాహకంగా ఇస్తారు. ఇది గరిష్ఠంగా రూ.15,000 వరకు ఉంటుంది. రూ.లక్ష వరకు వేతనం పొందే వారూ ఈ ప్రోత్సాహకం పొందేందుకు అర్హులే. ఆరు నెలల సర్వీసు పూర్తయిన తర్వాత తొలి విడత ప్రోత్సాహకం లభిస్తుంది. 12 నెలలు ఉద్యోగం చేసి, యాజమాని నిర్వహించే 'ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమా'న్ని పూర్తి చేసిన తర్వాత రెండో విడత ప్రోత్సాహకం చెల్లిస్తారు. దీన్ని ఫిక్సిడ్ డిపాజిట్ రూపంలోగానీ, సేవింగ్స్ పత్రాల రూపంలోగానీ కొంతకాలం పాటు డిపాజిట్ చేయాలి. కొత్తగా సృష్టించే ఉద్యోగాలకే ఈ ప్రోత్సాహకం లభిస్తుంది. పార్ట్‌బి ప్రకారం అదనంగా కల్పించే ప్రతి ఉద్యోగానికి ప్రోత్సాహకం కింద యజమానికి ప్రతినెలా రూ.3,000 చొప్పున రెండేళ్లు ఇస్తారు. తయారీ రంగ యజమానులకైతే మూడు, నాలుగేళ్లపాటు కూడా ఈ ప్రయోజనం కల్పిస్తారు.

# బీసీల నోటి కాడి బువ్వను కాజేసేందుకు బీజేపీ కుట్రలు



ఈ కబురు,న్యూఢిల్లీ : బీసీల నోటి కాడి బువ్వను బీజేపీ నేతలు తన్నే కుట్రలు చేస్తున్నారని మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, వాకిటి శ్రీహరి దుయ్యబట్టారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి బీసీ వ్యతిరేకి అని, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు ఫ్యూడలిస్టు అని మండిపడ్డారు. శుక్రవారం ఢిల్లీలోని థల్ కటోరా స్టేడియంలో ఏఐసీసీ బీసీ సంఘం నేతృత్వంలో 'భాగీదారీ న్యాయ సమ్మేళన్' కార్యక్రమంలో మంత్రులు పాల్గొని ప్రసంగించారు. అనంతరం తెలంగాణభవన్‌లో మంత్రులు పొన్నం, కొండా సురేఖ, వాకిటి మీడియాతో మాట్లాడారు. సామాజిక న్యాయానికి కాంగ్రెస్ బ్రాండ్ అంబాసిడర్ అని.. ఎట్టి పరిస్థితుల్లోనూ స్థానిక ఎన్నికల్లో 42 శాతం బీసీ రిజర్వేషన్లు అమలు చేస్తామని స్పష్టం చేశారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం ఆనాడు సొంత పార్టీతోనే పోరాడామని, దమ్ముంటే బీజేపీ రాష్ట్ర నేతలు కేంద్రంపై ఒత్తిడి తేవాలని సవాల్ విసిరారు.

బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల్లోని బీసీ నేతలు ఆ పార్టీల తీరుపై ఆలోచించాలని, అధిష్ఠానాలను ప్రశ్నించాలని సూచించారు. కిషన్ రెడ్డిది ద్వంద వైఖరి అని, ఆయన బీసీ వ్యతిరేకి అని మండిపడ్డారు. బిల్లులపై స్పష్టత ఇవ్వకుండా మతం పేరుతో తాత్సారం చేయాలనుకుంటే బీజేపీ నేతలను బీసీలు బయట తిరగనివ్వబోరని హెచ్చరించారు. బీసీ రిజర్వేషన్లను అడ్డుకునేందుకు ప్రయత్నిస్తే సకల జనుల సమ్మెను మించిన ఉద్యమాన్ని చూస్తారన్నారు. ఇకనైనా కిషన్‌రెడ్డి బీసీ రిజర్వేషన్లపై చర్చించేందుకు ప్రధాని అపాయింట్‌మెంట్ కోరాలని, తెలంగాణ ప్రజలు ఓట్లేసి గెలిపిస్తేనే కేంద్రమంత్రి అయ్యాననే విషయాన్ని గుర్తుంచుకోవాలని హితబోధ చేశారు. కులగణనలో భాగం కాని కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావులకు బీసీ రిజర్వేషన్లపై మాట్లాడే హక్కే లేదని వ్యాఖ్యానించారు. కాగా, భాగీదారీ న్యాయ సమ్మేళన్ కార్యక్రమానికి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్ ఠాకూర్, షబ్బీర్ అలీ, వి.హన్మంతరావు, కైలాశ్ నేతతో పాటు తెలంగాణ నుంచి పలువురు నేతలు హాజరయ్యారు.

# హెచ్‌సీయూ భూముల్లో సీఎంకు కమీషన్లు



ఈ కబురు,:హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల అమ్మకం, తాకట్టు విషయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఏపీకి చెందిన బీజేపీ ఎంపీ సీఎం రమేశ్ కమీషన్లు ఇప్పించాడని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె. తారక రామారావు ఆరోపించారు. అందుకు ప్రతిఫలంగా (క్విడ్ ప్రో కో) కింద రూ. 1,600 కోట్ల విలువ చేసే ఫోర్త్ సిటీ రోడ్డు కాంట్రాక్టును ఆయనకు సీఎం అప్పగించారన్నారు. బీజేపీ ఎంపీకి కాంగ్రెస్ సీఎం రేవంత్‌రెడ్డి రూ. వందల కోట్ల విలువ చేసే కాంట్రాక్టులు ఇస్తుంటే కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఎందుకు మౌనం వహిస్తున్నారని ప్రశ్నించారు.

బీజేపీ నేతలతో కాంగ్రెస్ సీఎం కుమ్మక్కు అవుతున్న సంగతి రాహుల్‌కు కనిపించడం లేదా అని కేటీఆర్ నిలదీశారు. తెలంగాణ భవన్ వేదికగా బీఆర్ఎస్ విద్యార్థి విభాగంలో తెలంగాణ విద్యార్థి సేన పరిషత్ కేటీఆర్ సమక్షంలో విలీనమైంది. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీ నడుమ రాజకీయ అక్రమ సంబంధం కొనసాగుతోందని మండిపడ్డారు.

**లేఖను చదవలేని రేవంత్‌కు దొంగ డిగ్రీ ఉందేమో?**

'సోనియాగాంధీ రాసిన ఉత్తరంలో ఏముందో చదవడం రాక మురిసిపోతున్న రేవంత్‌రెడ్డిని చూస్తే జాలేస్తోంది. సీఎం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి రాలేనని సోనియా గాంధీ చెప్పిన మాటను అర్థం చేసుకోలేక తనను ప్రశంసించిందని మురిసిపోతున్నాడు. సోనియా లేఖను కూడా చదివే తెలివి రేవంత్‌రెడ్డికి లేదు. లెటర్‌ను కూడా చదవలేని రేవంత్‌రెడ్డికి దొంగ డిగ్రీ ఉందేమోనని అనుమానం వస్తోంది'అని కేటీఆర్ ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలపై అక్రమ కేసులు నమోదు చేస్తున్న పోలీసు అధికారులు వైఖరి మార్చుకోవాలని హెచ్చరించారు. చట్టవ్యతిరేకంగా వ్యవహరిస్తున్న పోలీసు అధికారులకు తాము అధికారంలోకి వచ్చాక వడ్డీతో సహా చెల్లిస్తామన్నారు.

**ఆఫర్ లెటర్లతో గప్పాలు**

'ఒక్క ఉద్యోగ నోటిఫికేషన్ కూడా ఇవ్వని రేవంత్‌రెడ్డి.. ఆఫ ర్ లెటర్లు ఇచ్చి గొప్పలు చెప్పుకుంటున్నాడు. చరిత్ర ఉన్నంతకాలం తెలంగాణ రాష్ట్రం కోసం విద్యార్థులు చేసిన పోరాటాలు, అమరవీరుల బలిదానాలను ప్రజలు చెప్పుకుంటారు. నల్లగొండ జిల్లా కేసీఆర్ పాలనలోనే అన్ని రంగాల్లో అభివృద్ధి చెందింది. విద్యార్థులు సహా అన్ని వర్గాలకు మోసపూరిత హామీలు ఇచ్చి రేవంత్ అధికారంలోకి వచ్చాడు. హామీల అమలు నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు రోజుకో ఆరోపణ మాపై చేస్తూ పబ్బం గడుపుకుంటున్నాడు'అని కేటీఆర్ మండిపడ్డారు. సమావేశంలో మాజీ మంత్రులు వేముల ప్రశాంత్‌రెడ్డి, జగదీశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్, బీఆర్ఎస్‌వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్, పల్లా ప్రవీణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మొదటి పేజీ తరువాయి

# హైటెక్ మండలంలో 'ఆఖరి మజిలీ'కి అరిగోస



ఖననం చేసేందుకు తీసిన గుంతలో చేరిన ఊట వరద నీరు



మృతదేహానికి బండరాయి కట్టి ఖననం చేస్తున్న దృశ్యం



చెట్లతో చిట్టడవిని తలపిస్తున్న అంజయ్యనగర్ హిందూ స్మశాన వాటిక

హైటెక్ మండలంలో జీవితమంతా బ్రతుకు పోరాటంలో ఉరుకులు పరుగుల మధ్య గడిపి తనువు చాలిస్తున్న అంజయ్య నగర్ వాసులకు చివరి మజిలీ అరిగోసగా మారుతుంది. ముఖ్యంగా వర్షాకాలంలో స్థానికంగా ఎవరైనా మరణిస్తే అంతిమయాత్ర కోసం బంధుమిత్రులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. హైటెక్ మండలం శేరిలింగంపల్లి పరిధిలోని గచ్చిబౌలి అంజయ్య నగర్ లో వేల సంఖ్యలో జనాభా నివాసం ఉంటున్నారు. కాగా స్థానికంగా ఉన్న హిందూ స్మశానవాటికలో వసతులు తీవ్ర ఇబ్బందికరంగా మారాయి. స్మశాన వాటిక మొత్తం చెట్లు మొలిచి చిట్టడివిని తలపిస్తుండగా, వర్షాకాలంలో చిన్న వర్షం వచ్చిందంటే స్మశాన వాటిక మొత్తం నీటితో నిండిపోతుంది. చుట్టూ ఉన్న ప్రాంతం ఎత్తుగా ఉండడం.. స్మశాన వాటిక లోతట్టు ప్రాంతంగా మిగిలిపోవడంతో వర్షం పడిందంటే వరద నీరు మొత్తం వచ్చి స్మశాన వాటికలో చేరుతుంది. దీని కారణంగా స్మశాన వాటిక మొత్తం వరద నీటితో బురదమయం అవుతుంది. వర్షాకాలంలో స్థానికంగా ఎవరైనా మరణిస్తే ఖననం చేసేందుకు బొంద తీస్తే గుంత మొత్తం నీటి ఊటతో నిండిపోతుంది. స్మశాన వాటిక లోపలికి వెళ్లాలన్నా.. లోపలి వరకు పాడే మోయాలన్నా.. బంధుమిత్రులు చెప్పులు చేతుల్లో పట్టుకొని బురదలో అడుగులో అడుగు వేస్తూ జాగ్రత్తగా వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. గత రెండు రోజుల క్రితం స్థానికంగా ఓ వ్యక్తి మృతి చెందగా అంతిమ సంస్కారాలు నిర్వహించేందుకు బంధుమిత్రులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఖననం చేసేందుకు తీసిన బొందలో వర్షపు నీరు చేరడంతో మృతదేహానికి బండరాయిని కట్టి నీళ్లలో తేలకుండా అంతిమ సంస్కారాలు నిర్వహించారు. స్మశాన వాటిక మొత్తం బురదమయం కావడంతో కేవలం కొద్ది మంది మాత్రమే జాగ్రత్తగా వెళ్లి ఖననం చేయడం ఇక్కడి దుస్థితికి అద్దం పడుతుంది. కాగా వేల సంఖ్యలో ప్రజలు నివాసం ఉంటున్న అంజయ్య నగర్ స్మశాన వాటికను అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నో ఏళ్ల క్రితమే స్థానిక ప్రజాప్రతినిధులు ఈ స్మశాన వాటికను దత్తత తీసుకొని అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారని, నేటికీ ఆ హామీ నీటి మూటగానే మారిందని వాపోతున్నారు. స్మశాన వాటికలో కనీస వసతులు లేకపోగా, పూర్తిగా చెట్లు పెరిగి చిట్టడవిని తలపిస్తుందని అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి అంజయ్య నగర్ స్మశాన వాటికను అభివృద్ధి చేయాలని కోరుతున్నారు.



బురదమయంగా మారిన స్మశాన వాటిక

## ఉరివేసుకుని వృద్ధురాలు ఆత్మహత్య




ఈకబురు, శేరిలింగంపల్లి : కడుపున పుట్టిన పిల్లలు ఉద్యోగాల వేటలో ఇతర ప్రాంతాల్లో స్థిరపడగా భర్తతో కలిసి కొండాపూర్ లో ఉంటున్న ఓ వృద్ధురాలు అనారోగ్య కారణాలతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు పోలీసుల తరపున ప్రకారం ఇలా ఉన్నాయి..

కొండాపూర్ ప్రశాంత్ నగర్ కాలనీలో గల సాయిబాబా గుడి సమీపంలో ఉద్యోగ పదవీ విరమణ చేసిన రామమూర్తి తన భార్య రాగి స్వరాజ్యం (61) తో కలిసి నివాసం ఉంటున్నాడు. వీరి పిల్లలు ఉద్యోగాల నిమిత్తం ఇతర దేశాలు, రాష్ట్రాల్లో ఉంటుండగా, స్థానికంగా భార్యాభర్తలు ఇద్దరే ఉంటున్నారు. కాగా గత కొంతకాలంగా రాగి స్వరాజ్యం అనారోగ్యంతో ఇబ్బందులు పడుతుంది. ఈ క్రమంలో గురువారం రాత్రి భార్య స్వరాజ్యం బెడ్రూంలో నిద్రపోగా, భర్త రామమూర్తి హాల్ లో నిద్రించాడు. అర్ధరాత్రి 2 గంటల ప్రాంతంలో నిద్రలేచిన రామమూర్తి బెడ్ రూమ్ లో చూడగా గదిలో ఉన్న సీలింగ్ ఫ్యాన్ కు చీరతో ఉరివేసుకొని స్వరాజ్యం ఆత్మహత్య చేసుకుని కనిపించింది. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న గచ్చిబౌలి పోలీసులు సంఘటనా స్థలికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

మొదటి పేజీ తరువాయి

## కొవిడ్ బాధితుల మెదళ్లకు ముందుగానే ముసలితనం



ఈ కబురు,:దిల్లీ: ఇన్‌ఫెక్షన్ ఏ స్థాయిలో ఉందన్న విషయంతో ప్రమేయం లేకుండా కరోనా బారిన పడిన వ్యక్తుల మెదళ్లు వేగంగా ముసలితనానికి గురయ్యే అవకాశం ఉందని, అవి ఉండాల్సిన దానికన్నా ఎక్కువ వార్ధక్యంతో ఉన్నాయని ఒక అధ్యయనంలో తేలింది. కొవిడ్ బారినపడిన 432 మంది వ్యక్తుల మెదడు స్కాన్‌లు మహమ్మారికి ముందు, తర్వాత ఈ అధ్యయనం కోసం తీసుకున్నారు. 996 మంది ఆరోగ్యవంతుల స్కాన్‌లనూ తీసుకున్నారు. వీరితో పోలిస్తే వ్యాధిబారిన పడినవారి మెదళ్లు ఐదున్నర నెలలు ఎక్కువగా వృద్ధాప్యానికి గురైనట్టు గుర్తించారు. కరోనా పీడితులు ఏకాంతంలో గడపాల్సిరావడం, అనిశ్చిత పరిస్థితి ఎదుర్కోవాల్సిరావడం ఇందుకు కారణాలు కావచ్చని అధ్యయనకర్తలు పేర్కొన్నారు. మహమ్మారికి గురైన వయోవృద్ధులు, పురుషులు, నిరుద్యోగులు, తక్కువ ఆదాయం కలిగినవారు, తగినంతగా చదువుకోనివారు, ఇతర బలహీన నేపథ్యం కలిగినవారి మెదళ్లలో ప్రస్ఫుటమైన మార్పులు సంభవించాయని గుర్తించారు. మెదడు వార్ధక్యానికి గురైనప్పుడు వ్యక్తుల ఆలోచనలు మసకబారడం, సమాచార విశ్లేషణ, సేకరణ, అవగాహనకు కారణమైన ధారణశక్తి కోల్పోవడం, ఏకాగ్రత సన్నగిల్లడం వంటి లక్షణాలు ప్రదర్శిస్తారని పరిశోధకులు చెబుతున్నారు. కరోనా సోకినవారిలో ఈ లక్షణాలు ఎక్కువగా గమనించినట్లు వారు పేర్కొంటున్నారు.

మొదటి పేజీ తరువాయి

## మంజీరా డైమండ్ హైట్స్ లో పర్యటించిన గచ్చిబౌలి కార్పొరేటర్

**కాలనీలో అభివృద్ధి పనులకు కృషి : కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి**



కార్పొరేటర్ కు వినతి పత్రం సమర్పిస్తున్న స్థానికులు

ఈకబురు,శేరిలింగంపల్లి : శేరిలింగంపల్లి నియోజకవర్గం గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని గోపనపల్లిలో గల మంజీరా డైమండ్ హైట్స్ కాలనీలో శుక్రవారం స్థానిక కార్పొరేటర్ వి.గంగాధర్ రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ స్థానికులు కార్పొరేటర్ కు వినతిపత్రం సమర్పించారు. మంజీర డైమండ్ హైట్స్ కాలనీలో అసంపూర్తిగా మిగిలిపోయిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పైప్ లైన్ నిర్మాణ పనులను పూర్తి చేయాలని, మంచి నీటి వసతిని మెరుగుపర్చాలని, విధి దీపాలు సక్రమంగా పనిచేసేలా చూడాలని, పారిశుధ్య పనులు సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు.



డైమండ్ హైట్స్ లో పర్యటిస్తున్న కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి

కాలనీలో ఉన్న పార్క్ స్థలంలో ఓపెన్ జిమ్, చిల్డ్రెన్స్ పార్క్, క్రీడా ప్రాంగణం ఏర్పాటుకు కృషి చేయాలని కోరారు .ఈ విషయమై స్పందించిన కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి వెంటనే సంబంధిత అధికారులతో ఫోన్ లో మాట్లాడారు. మంజీర డైమండ్ హైట్స్ అపార్ట్మెంట్ వాసులు ఎటువంటి ఇబ్బందులు లేకుండా భూగర్భ డ్రైనేజీ నిర్మాణం పూర్తి చేస్తామని, సీసీ రోడ్డు ,ఓపెన్ జిమ్, చిల్డ్రెన్స్ పార్క్, క్రీడా ప్రాంగణం వ్యవస్థ అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం చేసి పనులు వేగంగా చేపట్టి పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మంజీర మంచీ నీటి వసతిని మెరుగుపరుస్తామని, దశల వారిగా అన్ని పనులు పూర్తి చేసి కాలనీలో చక్కటి ఆహ్లాదకరమైన వాతావరణం కలిపిస్తామని హామీ ఇచ్చారు. పెరుగుతున్న జనాభా దృశ్య భూగర్భ డ్రెయినేజీ పైప్ లైన్ దయా పెంచి లెవల్స్ తో అనుసంధానం చేస్తూ ఒక కాలనీ నుండి మరొక కాలనీకి మధ్యన ఇబ్బందులు తల్లెత్త కుండ ప్రణాళిక బద్దంగా పనులు చేపడుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో మంజీర డైమండ్ హైట్స్ కాలనీ వాసులు పిఆర్ రావు ,అతుల్, సత్య నారాయణ,రెడ్డి, ఫణి, వెంకటేష్, అర్జున్, వరుణ్, సత్యనారాయణ, ప్రవీణ్, సుందర చారి, సీనియర్ నాయకులు శేఖర్, సుమన్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## దేవాలయాల్లో ఆగని చోరీలు..

**మరో రెండు దేవాలయాల్లో హుండీలు పగులగొట్టి నగదు ఎత్తుకెళ్లిన దుండగులు**

ఈకబురు, శేరిలింగంపల్లి : శేరిలింగంపల్లిలో దేవాలయాలే టార్గెట్ గా దొంగలు చెలరేగిపోతున్నారు. మియాపూర్ చందానగర్ పోలీస్ స్టేషన్ల పరిధిలోని దేవాలయాల్లో వరుస చోరీలు కొనసాగుతున్నాయి. తాజాగా మరో రెండు దేవాలయాల్లో హుండీలను దుండగులు ఎత్తుకెళ్లారు. చందానగర్ హుడా ఫేజ్ 2లోని సాయిబాబా ఆలయంలో రెండు హుండీలతో పాటు అక్కడే నివాసం ఉంటున్న వాచ్మెన్ రూం తాళం పగలగొట్టి నగదుతో పాటు బంగారు ఆభరణాలను చోరీ చేశారు. చందానగర్ పోలీసులు తెలిపిన వివరాల..గురువారం రాత్రి 10:30 గంటలకు సాయిబాబా ఆలయం మూసివేయగా, శుక్రవారం తెల్లవారు జామున 4 గంటలకు ఆలయంలో వాచ్మెన్ నాగేశ్వరరావు గుడి గ్రిల్ తాళాలు పగలగొట్టి ఉండడాన్ని గమనించి అర్చకులకు సమాచారమందించాడు. అక్కడికి చేరుకున్న అర్చకులు గుడి లోపలికి వెళ్ళి గమనించగా.. రెండు హుండీలు, మేనేజర్ టేబుల్ తాళలు పగలగొట్టి అందులోని నగదును అపహరించడంతో పాటు, అక్కడే ఉన్న వాచ్మెన్ రూంలో దొంగతనానికి పాల్పడినట్లు గుర్తించారు. వెంటనే అర్చకులు శ్రీనివాసరావు పోలీసులకు సమాచారం అందించగా పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.



దుండగులు ధ్వంసం చేసిన దేవాలయం హుండీ

**మియాపూర్ లో..**

మియాపూర్ లోని సంతోషిమాత, సాయిబాబా దేవాలయాల్లో గుర్తుతెలియని వ్యక్తులు శుక్రవారం తెల్లవారుజామున దేవాలయాల్లోని హుండీలను ఎత్తుకెళ్లారు. దేవాలయానికి సమీపంలో ఉన్న చెరువు కట్ట పైకి తీసుకువెళ్లి హుండీలను పగలగొట్టి అందులో ఉన్న నగదును దొంగలించారు ఈ సంఘటన మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది.. ఉదయం దేవాలయానికి వచ్చిన పూజారులకు హుండీలు కనిపించకపోవడంతో ఆలయ కమిటీ సభ్యులకు సమాచారం అందించారు. ఆలయ కమిటీ సభ్యులు మియాపూర్ పోలీసులకు సమాచారం అందించగా, పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. సీసీ కెమెరాలు పరిశీలించగా ఇద్దరు వ్యక్తులు ఆలయంలోకి చొరబడి హుండీలను ఎత్తుకు వెళ్ళినట్లు గుర్తించారు. ఆలయ కమిటీ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.



సీసీ కెమెరాలు రికార్డు అయిన దుండగుల కదలికలు

## పాఠశాల ముందు ఆందోళన చేస్తున్న విద్యార్థి సంఘాలు





పాఠశాల ముందు ఆందోళన చేస్తున్న విద్యార్థి సంఘాలు

### మియాపూర్ స్కూల్ ముందు విద్యార్థి సంఘాల ఆందోళన

ఈకబురు, శేరిలింగంపల్లి : వారం రోజుల వ్యవధిలో ఒకే పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థుల ఆత్మహత్యకు పాఠశాల యాజమాన్యమే కారణమని పలు విద్యార్థి సంఘాలు ఆరోపించాయి. ఈ మేరకు శుక్రవారం మియాపూర్ సెయింట్ మార్టిన్స్ స్కూల్ ముందు విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో విద్యార్థులు ఆందోళన చేపట్టారు. స్కూల్ మేనేజ్మెంట్ ఒత్తిడి కారణంగా గురువారం మధ్యాహ్నం పదవ తరగతి చదువుతున్న హన్సిక అనే విద్యార్థిని తను నివాసం ఉంటున్న బిల్డింగ్ ఐదవ అంతస్తు నుండి కిందకు దూకి ఆత్మహత్య చేసుకుందని బీఆర్ఎస్వీ, ఎన్ఎస్ యూఐ, ఏఐఎఫ్ బిఎస్ విద్యార్థి సంఘాల నాయకులు అరోపించారు. ఆత్మహత్య చేసుకున్న విద్యార్థిని హన్సిక కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థి సంఘాల ఆందోళనలతో మియాపూర్ పోలీసులు స్కూల్ వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. తన కుమార్తె ఆత్మహత్యకు స్కూల్ మేనేజ్మెంట్ తో పాటు రిజ్వాన్ తల్లిదండ్రులు కారణమని విద్యార్థిని తండ్రి బిజాయ్ నాయక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు స్కూల్ యజమాన్యం, రిజ్వాన్ తల్లిదండ్రులపై మియాపూర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## పొన్నం, మహేశ్‌కుమార్‌లలో ఒకరిని సీఎం చేయండి: రామచందర్‌రావు

ఈ కబురు,:హైదరాబాద్: మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయను ఉపరాష్ట్రపతిని చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కోరడాన్ని స్వాగతిస్తున్నామని, అయితే బీసీలైన మంత్రి పొన్నం ప్రభాకర్, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్‌లలో ఒకరిని రాష్ట్రానికి సీఎం చేయాలని కోరుతున్నానని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు పేర్కొన్నారు. భాజపా రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం రామచందర్‌రావు మీడియాతో ఇష్టాగోష్ఠి నిర్వహించారు. 'కాంగ్రెస్ బీసీలకు మేలు చేస్తున్నట్లు ప్రకటనలు చేస్తోంది. కానీ బీసీలపై భాజపాకే నిజమైన ప్రేమ ఉంది. అందుకే బీసీ కమిషన్ వేసింది. గతంలో భారత రాష్ట్ర సమితి ఎంబీసీ కమిషన్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు, రూ.వెయ్యి కోట్లు దానికి కేటాయిస్తున్నట్లు ప్రకటించినా ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదు. మా పార్టీకున్న బీసీల బలం తగ్గించాలన్న లక్ష్యంతోనే రేవంత్‌రెడ్డి బీసీల పాట పాడుతున్నారు. భాజపాలో అంతర్గత విభేదాలు కుటుంబ గొడవల్లాంటివి. బండి సంజయ్, ఈటల వివాదంపై పార్టీ అధినాయకత్వం చర్యలు తీసుకుంటుంది. వేముల రోహిత్ కేసులో సరైన ఆధారాల్లేక పోలీసులు మూసేశారు. ఈ విషయంలో నాపై ఉపముఖ్యమంత్రి భట్టి ఆరోపణలు చేయడం సరికాదు. అందుకే లీగల్ నోటీసు ఇచ్చా. నోటీసుకు స్పందించి ఆయన క్షమాపణలు చెప్పకుంటే కోర్టు ద్వారానే పోరాటం చేస్తా. గత అయిదేళ్లలో నాకు ఏ పదవీ లేదు. ఇప్పుడు నేరుగా అధ్యక్ష పదవి వరించింది. పార్టీ కోసం పనిచేసే వారికి పదవులతో పనిలేదు. నేను పార్టీని బలోపేతం చేసేందుకు నిత్యం ప్రజల్లో ఉంటా. వచ్చే ఎన్నికల్లో నేను పోటీలో ఉండను. పార్టీ అధికారం కోసమే పనిచేస్తా' అని రామచందర్‌రావు అన్నారు.ప్రతినిధులు మంత్రిని కలిశారు. తెలంగాణ ప్రజల ఆరోగ్య రికార్డుల డిజిటలైజేషన్‌లో ఇంకా ప్రథమ దశలోనే ఉందని శ్రీధర్‌బాబు తెలిపారు. వంద శాతం ప్రగతి సాధించిన ఎస్తోనియా తమకు సాంకేతిక సహకారం అందించాలని కోరారు.





# బిలియనీర్ క్లబ్‌లోకి సుందర్ పిచాయ్

టెక్ దిగ్గజం గూగుల్ మాతృసంస్థ ఆల్ఫాబెట్ సీఈఓ, భారత అమెరికన్ సుందర్ పిచాయ్ అరుదైన ఘనతను చేరుకున్నారు. 10 ఏళ్లుగా ఈ సంస్థకు సీఈఓగా కొనసాగుతోన్న ఆయన.. తాజాగా బిలియనీర్స్ క్లబ్‌లోకి అడుగుపెట్టారు. ప్రస్తుతం ఆయన నికర సంపద 1.1 బిలియన్ డాలర్లు దాటినట్లు బ్లూమ్‌బర్గ్ బిలియనీర్స్ సూచీ వెల్లడించింది.

2023 నుంచి ఆల్ఫాబెట్ కంపెనీ షేర్లు రాణిస్తున్నాయి. ఈ రెండేళ్లలోనే సంస్థ మార్కెట్ విలువ మరో ట్రిలియన్ డాలర్లు పెరిగి 2 ట్రిలియన్ డాలర్లు దాటింది. గురువారం నాటి ట్రేడింగ్‌లో ఆల్ఫాబెట్ షేర్లు ఏకంగా 4.1శాతం మేర లాభంతో ట్రేడ్ అయ్యాయి. దీంతో సీఈఓ సుందర్ పిచాయ్ నికర సంపద 1.1 బిలియన్ డాలర్లకు చేరినట్లు బ్లూమ్‌బర్గ్ తన కథనంలో వెల్లడించింది. ఫోర్బ్స్ బిలియనీర్స్ సూచీలోనే పిచాయ్ నికర సంపద 1.2 బిలియన్ డాలర్లుగా ఉంది.

టెక్ రంగంలో వ్యవస్థాపక సభ్యుడు కాని ఓ సీఈఓ ఇలా బిలియనీర్స్ క్లబ్‌లో చేరడం అత్యంత అరుదని బ్లూమ్‌బర్గ్ పేర్కొంది. మెటా అధినేత మార్క్ జుకర్‌బర్గ్, ఎన్విడియా అధిపతి జెన్సెన్ హువాంగ్ వంటి వారు తమతమ కంపెనీలను స్థాపించి వ్యవస్థాపక ఈక్విటీ వాటాలను దక్కించుకున్నారు. దీంతో వారి నికర సంపద భారీగా పెరిగింది. ఆల్ఫాబెట్ బుధవారం త్రైమాసిక ఫలితాలను వెల్లడించింది. రెండో త్రైమాసికంలో కంపెనీ ఆదాయం 96.4 బిలియన్ డాలర్లుగా ఉంది. క్యూ2లో సంస్థ 28.2 బిలియన్ డాలర్ల లాభాలను ఆర్జించింది.

తమిళనాడులోని ఓ మధ్యతరగతి కుటుంబంలో జన్మించిన సుందర్ పిచాయ్.. 1993లో స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీలో స్కాలర్‌షిప్ సాధించారు. అక్కడ చదువు పూర్తిచేసుకొని 2004లో ఓ సాధారణ ఉద్యోగిగా గూగుల్లోకి అడుగుపెట్టారు. సంస్థ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేశారు. గూగుల్ క్రోమ్, ఆండ్రాయిడ్, గూగుల్ డ్రైవ్ ఇలాంటి గొప్ప గొప్ప ఆవిష్కరణలన్నీ ఆయన ఆలోచనల నుంచి పుట్టుకొచ్చినవే. ఆ కష్టానికి ప్రతిఫలంగా 2015లో ఆయనకు సీఈఓ పదవి దక్కింది. ఈ ఏడాది ఆగస్టుతో సీఈఓగా 10 ఏళ్లు పూర్తి చేసుకోనున్నారు.

# భారీ నష్టాల్లో స్టాక్ మార్కెట్లు.. కుప్పకూలిన బజాజ్ షేర్లు

బజాజ్ ఫైనాన్స్, బజాజ్ ఫిన్‌సర్వ్, ఇతర హెవీవెయిట్ షేర్ల బలహీనత మధ్య భారత స్టాక్ మార్కెట్లు శుక్రవారం గణనీయంగా నష్టాల్లో ముగిశాయి. బీఎస్ఈ సెన్సెక్స్ 721 పాయింట్లు (0.88 శాతం) నష్టపోయి 81,463.09 వద్ద, ఎన్ఎస్ఈ నిఫ్టీ 225 పాయింట్లు (0.9 శాతం) క్షీణించి 24,837 వద్ద స్థిరపడ్డాయి. బీఎస్ఈలో బజాజ్, పవర్ గ్రిడ్, టెక్ మహీంద్రా, ఇన్ఫోసిస్, ట్రెంట్ షేర్లు టాప్ లూజర్స్‌గా నిలవగా సన్ ఫార్మా మాత్రమే లాభపడింది.

విస్తృత మార్కెట్లలో నిఫ్టీ మిడ్ క్యాప్ ఇండెక్స్ 1.61 శాతం, నిఫ్టీ స్మాల్ క్యాప్ ఇండెక్స్ 2.1 శాతం నష్టపోయాయి. రంగాలవారీగా చూస్తే నిఫ్టీ ఫార్మా (0.54 శాతం) మినహా అన్ని కౌంటర్లలో అమ్మకాలు కనిపించాయి. నిఫ్టీ ఆటో 1.27 శాతం, నిఫ్టీ ఐటీ 1.42 శాతం, నిఫ్టీ మెటల్ 1.64 శాతం, నిఫ్టీ రియల్టీ 0.99 శాతం, నిఫ్టీ ఫైనాన్షియల్ సర్వీసెస్ 0.91 శాతం, నిఫ్టీ ఎఫ్ఎంసీజీ 0.9 శాతం నష్టపోయాయి.దేశీయ మార్కెట్లో మార్కెట్ అస్థిరతకు కొలమానమైన ఇండియా వీఐఎక్స్ 5.15 శాతం లాభంతో 11.28 వద్ద ముగిసింది.



# ఐటీఆర్ ఎంపికలో తప్పు చేస్తే







**ఆదాయపు పన్ను రిటర్నులను ఎప్పుడూ సరైన పత్రంలోనే దాఖలు చేయాలి. లేకపోతే రిఫండు ఆలస్యం కావొచ్చు, కొన్నిసార్లు జరిమానాలూ పడొచ్చు. మరి పొరపాటున ఒక ఐటీఆర్ ఫారం బదులో మరోటి ఎంచుకుంటే? ఆ తప్పును ఎలా సరిదిద్దుకోవాలి? ఇందుకు గల మార్గాలేమిటి.. చూద్దాం.**

గత ఆర్థిక సంవత్సరానికి (202425)గాను ఆదాయపు పన్ను రిటర్నులు దాఖలు చేసేందుకు సెప్టెంబరు 15 వరకూ గడువు ఉంది. వీలైనంత తొందరగా ఈ బాధ్యతను పూర్తి చేయడం మంచిది. చాలామంది చేసే పొరపాటు ఏమిటంటే.. ఉద్యోగులు తమకు ఇతర ఆదాయ వనరులు లేదా మూలధన లాభాలు ఉన్నప్పటికీ ఐటీఆర్1 మాత్రమే సరిపోతుందనే భావనలో ఉంటారు. కానీ, వీరికి కొన్నిసార్లు ఐటీఆర్2, లేదా ఐటీఆర్3 వర్తించే అవకాశం ఉంది. ముఖ్యంగా షేర్లలో పెట్టుబడులు పెట్టిన వారు, ఎఫ్అండ్ఓలు చేసే వారికి ఇది వర్తిస్తుంది. ఇలా ఫారం ఎంచుకోవడంలో చేసే పొరపాటు కొన్నిసార్లు ఇబ్బందులకు గురిచేయొచ్చు.

అనుకోకుండా తప్పు రిటర్ను ఫారం ఎంచుకున్నప్పుడు దాన్ని సవరించేందుకు ప్రయత్నించాలి. ఆదాయపు పన్ను చట్టంలోని సెక్షన్ 139(5) కింద దీన్ని అనుమతిస్తారు. సంబంధిత అసెస్‌మెంట్ సంవత్సరం (ప్రస్తుతం 202526) ముగిసే 3 నెలల ముందు, లేదా ఆదాయపు పన్ను అధికారులు ఆ రిటర్నులను అసెస్ చేసే ముందు.. ఇందులో ఏది ముందు పూర్తయితే అప్పటి వరకూ సవరించిన రిటర్నులు దాఖలు చేయొచ్చు.
వ్యవధిలోపే రిటర్నులు దాఖలు చేశారనుకోండి. రిటర్నులలో సవరణ చేయడం తేలికే. ఇఫైలింగ్ వెబ్‌సైటులోకి వెళ్లి, సరైన ఐటీఆర్‌ను ఎంచుకోవాలి. ఫైలింగ్ సెక్షన్‌లో '139(5)రివైజ్ రిటర్న్ రివైజ్డ్ ఆఫ్టర్ ఫైలింగ్ ఒరిజినల్ రిటర్న్'ను క్లిక్ చేయాలి.

ఇప్పటికే మీరు దాఖలు చేసిన ఒరిజనల్ ఐటీఆర్ రశీదు నంబరును ఇక్కడ నమోదు చేయాల్సి ఉంటుంది. అవసరమైన మార్పులు చేసి, రిటర్నులు సమర్పించే వీలుంటుంది. ఇవెరిఫై చేయడం మర్చిపోవద్దు.
ఇలా సవరించిన రిటర్నులు దాఖలు చేసినప్పటికీ, దీన్ని ఒరిజినల్ రిటర్నుగానే పరిగణిస్తారు. కానీ, తరచూ మార్పులు చేస్తుంటే, ఐటీ శాఖ కృత్రిమ మేధ (ఏఐ) దృష్టిని ఆకర్షించే ఆస్కారం ఉంది. పెద్ద సవరణలు చేసినప్పుడు మీ నిర్లక్ష్యం లేదా ఆదాయాన్ని దాచే ప్రయత్నానికి సంకేతం ఇవ్వొచ్చు. ఫారం 26ఏఎస్, ఏఐఎస్, టీఐఎస్‌లోని సమాచారంతో మీ రిటర్ను సరిపోలకపోతే, నోటీసులు వచ్చే అవకాశాలూ ఉన్నాయి.

రివైజ్డ్ రిటర్నులను అన్ని సందర్భాల్లోనూ ఉపయోగించేందుకు వీలు కాదు. ఉదాహరణకు నష్టాన్ని ప్రకటించేందుకు, పెద్ద మొత్తంలో రిఫండును క్లెయిం చేసేందుకు అప్‌డేటెడ్ రిటర్న్ దాఖలు చేయలేరు. అలాగే పన్ను విభాగం ఇప్పటికే వివిధ సెక్షన్‌ల కింద అసెస్‌మెంట్‌ను ప్రారంభించినా ఇది సాధ్యం కాదు. ఐటీ రిటర్నులు దాఖలు చేసే ముందు మీ ఫారాన్ని ఒకటికి రెండు సార్లు తనిఖీ చేయండి. ఆ తర్వాతే వాటిని సబ్మిట్ చేసి, ఇవెరిఫై చేయడం మంచిది.

# వేలాది లేఆఫ్‌లు.. ఎమోషనల్ అయిన మైక్రోసాఫ్ట్ ఈసీవో

టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్‌లో వేలాది లేఆఫ్‌లపై ఆ సంస్థ సీఈవో సత్య నాదెళ్ల ఎమోషనల్‌గా స్పందించారు. ఇటీవల కంపెనీలో ఇటీవల 9,000 మందికి పైగా ఉద్యోగులను తొలగించడం తనను తీవ్రంగా ప్రభావితం చేస్తోందని అంగీకరించారు. అయితే సంస్థ ఏఐ పరివర్తనకు ఈ కోతలు అవసరమని ఆయన పేర్కొన్నారు.

కంపెనీ పరిణామాలపై ఆయన ఉద్యోగులకు లేఖలు పంపారు. "అన్నింటికంటే ముందుగా నేను నాపై ఎక్కువ భారం మోపుతున్న వాటి గురించి మాట్లాడాలనుకుంటున్నాను. ఇటీవలి ఉద్యోగ తొలగింపుల గురించి మీలో చాలా మంది ఆలోచిస్తున్నారని నాకు తెలుసు" అంటూ సత్య నాదెళ్ల లేఖ మొదలు పెట్టారు. " ఈ నిర్ణయాలు మనం తీసుకోవాల్సిన అత్యంత క్లిష్టమైనవి. మన సహోద్యోగులు, సహచరులు, స్నేహితులు.. మనం ఎవరితో అయితే కలిసి పనిచేశామో, నేర్చుకున్నామో,



లెక్కలేనన్ని క్షణాలను పంచుకున్నామో వారిని అవి ప్రభావితం చేస్తాయి" అంటూ రాసుకొచ్చారు.

మైక్రోసాఫ్ట్ 2014 తర్వాత ఈ సంవత్సరం భారీ సంఖ్యలో ఉద్యోగులను తొలగించింది. దాని ప్రపంచ శ్రామిక శక్తిలో 7 శాతం మందికి ఉద్వాసన పలికింది. ఉద్యోగాల కోతలో అనిశ్చితి, అసంబద్ధత కనిపిస్తోందని అంగీకరించిన సత్య నాదెళ్ల కంపెనీ వృద్ధిపై కూడా దృష్టి సారించారు. "మార్కెట్ పనితీరు, వ్యూహాత్మక స్థానం, వృద్ధి ఇలా అంశాల్లో లక్ష్యంతో కూడిన చర్యల ద్వారా మైక్రోసాఫ్ట్ పురోగమిస్తోంది. మనం మునుపటి కంటే మూలధన పెట్టుబడులు ఎక్కువ పెడుతున్నాం. మన మొత్తం హెడ్ కౌంట్‌లో పెద్దగా మార్పేమీ లేదు. మన పరిశ్రమలో, మైక్రోసాఫ్ట్‌లో కొంతమంది ప్రతిభ, నైపుణ్యానికి మునుపెన్నడూ చూడని స్థాయిలో గుర్తింపు, రివార్డులు లభిస్తున్నాయి. అదే సమయంలో లేఆఫ్‌లూ అమలు చేస్తున్నాం" అని వివరించారు.




# వేగంగా 1 లక్ష కార్లు ఎగుమతి చేసి రికార్డు

భారత ఆటోమొబైల్ తయారీలో మారుతీ సుజుకీ ఇండియా లిమిటెడ్ తన కాంపాక్ట్ ఎస్‌యూవీ ఫ్రాంక్స్ ఎగుమతుల్లో రికార్డు నెలకొల్పింది. భారతదేశం నుంచి వేగంగా 1 లక్ష ఎగుమతులను అధిగమించిన ఎస్‌యూవీగా నిలిచిందని కంపెనీ ప్రకటించింది. 2023 జూన్‌లో ప్రపంచ ఎగుమతి కార్యకలాపాలు ప్రారంభమైన కేవలం 25 నెలల్లోనే ఈ మైలురాయిని చేరుకుందని చెప్పింది.

గుజరాత్‌లోని మారుతీ సుజుకీ ప్లాంట్‌లో ప్రత్యేకంగా తయారు చేసిన ఫ్రాంక్స్ లాటిన్ అమెరికా, మిడిల్ ఈస్ట్, ఆఫ్రికాతో సహా విదేశీ మార్కెట్లలో బలమైన పనితీరును కనబరుస్తోందని కంపెనీ తెలిపింది. జపాన్‌లో దీనికి పెరుగుతున్న ప్రజాదరణ ఎగుమతి వృద్ధికి దోహదం చేసిందని చెప్పింది. మారుకీ సుజుకీ ఇండియా లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓ హిసాషి టేకుచి మాట్లాడుతూ.. 'ప్రపంచ మార్కెట్ల కోసం ప్రపంచ స్థాయి వాహనాలను తయారు చేయగల సామర్థ్యం కంపెనీకి ఉంది. మేక్ ఇన్ ఇండియా చొరవకు కంపెనీ సాధించిన విజయమే నిదర్శనం. ప్యాసింజర్ వాహన ఎగుమతులు, అంతర్జాతీయ మార్కెట్లపై దృష్టి సారిస్తున్నాం' అని చెప్పారు.

2026 ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలోనే మారుతీ సుజుకీ 96,000 వాహనాలను ఎగుమతి చేయడం విశేషం. భారతదేశ ప్యాసింజర్ వాహన ఎగుమతుల్లో రికార్డు స్థాయిలో 47 శాతం వాటాను ఆక్రమించింది. వరుసగా నాలుగో ఏడాది భారతదేశపు టాప్ ప్యాసింజర్ వాహన ఎగుమతిదారుగా కంపెనీ తన స్థానాన్ని నిలుపుకుంది.

# ఇండియా–యూకే ట్రేడ్ డీల్ వ్యవసాయానికి జాక్‌పాట్





భారత వ్యవసాయ రంగానికి ఇండియాయూకే ఇటీవల సంతకం చేసిన కాంప్రహెన్సివ్ ఎకనామిక్ అండ్ ట్రేడ్ అగ్రిమెంట్ (సీఈటీఏ) ఎంతో మేలు చేస్తుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. భారతీయ వ్యవసాయ, ప్రాసెస్ చేసిన ఆహార ఎగుమతుల్లో 95% యూకే మార్కెట్‌లో సుంకం లేకుండా అనుమతించే వీలుంది. ఇది భారతీయ రైతులు, వ్యవసాయ ఎగుమతిదారులకు మార్కెట్ అవకాశాలను గణనీయంగా పెంచుతుందని భావిస్తున్నారు. ఇటీవల కుదిరిన ఒప్పందం ప్రకారం వ్యవసాయానికి సంబంధించి కొన్ని ప్రధాన అంశాలు కింది విధంగా ఉన్నాయి.

**జీరో-డ్యూటీ యాక్సెస్**
**బాస్మతి, బాస్మతియేతర బియ్యం**
**పండ్లు మరియు కూరగాయలు**
**మసాలా దినుసులు (పసుపు, మిరియాలు, యాలకులు)**
**ప్రాసెస్ చేసిన ఆహారాలు (ఊరగాయలు, మసాలా మిశ్రమాలు, పండ్ల గుజ్జులు, రెడీ టు ఈట్ భోజనం)**
**సముద్ర ఉత్పత్తులు (రొయ్యలు, ట్యూనా, ఫిష్ మీల్, ఫిష్ ఫీడ్)**
**పాడి, వంట నూనెలు, యాపిల్స్ సుంకం రాయితీ పరిధిలోకి రావు. ఇది కీలకమైన దేశీయ పరిశ్రమలను కాపాడుతుంది.**

**గతంలో 70 శాతం వరకు దిగుమతి సుంకాలను ఎదుర్కొన్న ప్రాసెస్డ్ ఫుడ్ ప్రొడక్ట్స్ ఇప్పుడు జీరో డ్యూటీ పరిధిలోకి రానున్నాయి.**

వచ్చే మూడేళ్లలో యూకేకు భారత వ్యవసాయ ఎగుమతుల్లో 20% వృద్ధి నమోదవుతుందని అంచనా. ఇది భారతదేశం తన 100 బిలియన్ డాలర్ల వ్యవసాయ ఎగుమతి లక్ష్యానికి చేరువ కావడానికి సహాయపడుతుంది. ప్రస్తుతం 2.25 శాతం మాత్రమే ఉన్న బ్రిటన్ 5.4 బిలియన్ డాలర్ల సముద్ర దిగుమతుల్లో భారత్ వాటాను ఈ వాణిజ్య ఒప్పందం పెంచుతుందని భావిస్తున్నారు.

# బిడ్డ కోసం అప్పుడే మొదలు పెట్టేశారు

మెగాహీరో వరుణ్ తేజ్ త్వరలో తండ్రి కాబోతున్నాడు. ఈ ఏడాది మే నెలలో తన భార్య లావణ్య త్రిపాఠి ప్రెగ్నెన్సీతో ఉన్న విషయాన్ని బయటపెట్టాడు. అప్పటినుంచి ఓవైపు సినిమా చేస్తూనే మరోవైపు భార్యతో ఎప్పటికప్పుడు టూర్స్ వేస్తూనే ఉన్నాడు. ఇకపోతే పుట్టబోయే బిడ్డ కోసం ఇప్పటినుంచే షాపింగ్ కూడా మొదలుపెట్టేశారు. ఈ విషయాన్ని స్వయంగా లావణ్య త్రిపాఠినే బయటపెట్టింది.

నాగబాబు కొడుకు వరుణ్ తేజ్. 'ముకుంద' సినిమాతో హీరోగా పరిచయమయ్యాడు. ఫిదా, కంచె లాంటి చిత్రాలతో ఆకట్టుకున్నాడు. ఎఫ్ 2, ఎఫ్ 3 మూవీస్‌తో హిట్స్ కొట్టాడు. కానీ తర్వాత నుంచి సినిమాలైతే చేస్తున్నాడు గానీ సక్సెస్ కాలేకపోతున్నాడు. గతేడాది 'మట్కా'తో వచ్చాడు కానీ ఫలితం లేకుండా పోయింది. ప్రస్తుతం ఓ హారర్ కామెడీ చిత్రం చేస్తున్నాడు.

అసలు విషయానికొస్తే తనతో కలిసి సినిమాలు చేసిన హీరోయిన్ లావణ్య త్రిపాఠిని ఆరేడేళ్ల పాటు ప్రేమించిన వరుణ్ తేజ్.. 2023 నవంబరులో పెళ్లి చేసుకున్నాడు. ఈ మే నెలలో తాము తల్లిదండ్రులు కాబోతున్న విషయాన్ని అధికారికంగా ప్రకటించారు. ఇప్పుడు రాబోయే బేబీ కోసం షాపింగ్ చేయడం లాంటివి చూస్తుంటే మరో నెలరోజుల్లో గుడ్ న్యూస్ చెబుతారేమో అనిపిస్తుంది.



# ఆ సినిమా పెద్ద హిట్టవుతుందనుకున్నా.. రివర్స్ అయ్యేసరికి మనసు ముక్కలైంది



**కొండంత ఆశ పెట్టుకున్న సినిమా ఆడకపోతే ఎంతో బాధగా ఉంటుంది. ఓ సినిమా విషయంలో తనూ అలాగే బాధపడ్డానంటోంది శృతి హాసన్ . తాజాగా ఓ ఇంటర్వ్యూలో శృతి హాసన్ మాట్లాడుతూ.. కొన్ని సినిమాలు నాకెంతో స్పెషల్. వాటికోసం చాలా కష్టపడ్డాను. అవి బాక్సాఫీస్ వద్ద సరిగా ఆడనప్పుడు గుండె ముక్కలైనట్లు అనిపిస్తుంది.**

**హృదయం ముక్కలైంది**

చాలామంది ఆ సినిమాను నమ్మి పని చేస్తారు. తీరా అది విజయం సాధించకపోయేసరికి దాన్ని తట్టుకోవడం కష్టంగా ఉంటుంది. 3 సినిమా కమర్షియల్‌గా విజయం సాధించుంటే బాగుండేదనిపిస్తుంది. ఇప్పుడంటే పాన్ ఇండియా ట్రెండ్ ఉంది. ఓటీటీలు అందుబాటులో ఉన్నాయి. అప్పుడవన్నీ లేవు. 3 సినిమా హిందీలోకి డబ్ చేశాం. కానీ, ఓటీటీలు లేవు. ఆ మూవీ ఇప్పుడు రిలీజయ్యుంటే కొలవెరి సాంగ్ కంటే కూడా 3 చిత్రమే పెద్ద హిట్టయ్యేది. అలా కొన్ని చిత్రాలు ఎంతో కష్టపడి చేస్తే బాక్సాఫీస్ వద్ద పరాజయం పొందేవి అని చెప్పుకొచ్చింది.

**3 మూవీలో ధనుష్, శృతిహాసన్**

సినిమాకాగా శృతిహాసన్ ప్రస్తుతం కూలీ మూవీ చేస్తోంది. రజనీ కాంత్ హీరోగా నటించిన ఈ చిత్రం ఆగస్ట్ 14న విడుదల కానుంది. ఇందులో నాగార్జున, ఉపేంద్ర, సత్యరాజ్, ఆమిర్ ఖాన్ తదితరులు నటించారు. లోకేశ్ కగనరాజ్ దర్శకత్వం వహించగా అనిరుధ్ సంగీతం అందించాడు. 3 సినిమా విషయానికి వస్తే.. ధనుష్, శృతి హాసన్ జంటగా నటించారు. రజనీకాంత్ కూతురు ఐశ్వర్య (ధనుష్ మాజీ భార్య) దర్శకత్వం వహించింది. ఈ సినిమా విషాదకరమైన క్లైమాక్స్‌తో ముగుస్తుంది. గుండెల్ని పిండేసే ఈ చిత్రం 2012లో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. అప్పుడు బాక్సాఫీస్ మిక్స్‌డ్ టాక్ తెచ్చుకోగా రీరిలీజ్ అయినప్పుడు మాత్రం హిట్టుగా నిలవడం విశేషం.

# తీవ్ర అనారోగ్యం.. శారీరకంగా, మానసికంగా కుంగిపోయా..!: ఆనందం హీరోయిన్



ఆనందం సినిమా హీరోయిన్ గుర్తుందా? రేఖ వేదవ్యాస్ .. 2001లో వెండితెరకు పరిచయమైంది. తొలి సినిమా ఆనందంతోనే సెన్సేషన్ అయింది. ఒకటో నెంబర్ కుర్రాడు, దొంగోడు, జానకి వెడ్స్ శ్రీరామ్, ప్రేమించుకున్నాం.. పెళ్లికి రండి సినిమాలతో తెలుగు ప్రేక్షకులను అలరించింది. కన్నడలోనే ఎక్కువ సినిమాలు చేసి అక్కడ స్టార్ హీరోయిన్ స్టేటస్ అందుకుంది. 2014 తర్వాత వెండితెరకు గుడ్‌బై చెప్పిన ఈ బ్యూటీ రెండేళ్లక్రితం ఓ షోలో ప్రత్యక్షమైంది.

రీఎంట్రీకి రెడీ.. పూర్తిగా బక్కచిక్కిపోయి గుర్తుపట్టలేని స్థితిలో కనిపించింది. అనారోగ్యంతోనే సన్నబడినట్లు ఆ షోలో వెల్లడించింది. తాజాగా ఆమె రీఎంట్రీకి రెడీగా ఉన్నట్లు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రేఖ వేదవ్యాస్ మాట్లాడుతూ.. చిన్నవయసులోనే కెరీర్ ప్రారంభించాను. నేను కన్నడ అమ్మాయి కావడంతో సాండల్‌వుడ్‌కు షిఫ్ట్ అయిపోయి అక్కడే ఎక్కువ సినిమాలు చేశాను. అప్పుడు నాకు గైడెన్స్ ఇచ్చేవాళ్లు లేకపోవడంతో తెలుగులో ఎక్కువ సినిమాలు చేయలేకపోయాను.

తీవ్ర అనారోగ్యంతో సమస్యలు.. 2014 తర్వాత వ్యక్తిగత కారణాల వల్ల ఇండస్ట్రీకి దూరమయ్యాను. ఒకానొక సమయంలో తీవ్ర అనారోగ్యానికి గురయ్యాను. శారీరకంగా, మానసికంగా కుంగిపోయాను. చాలా నరకం అనుభవించాను. చాలా కాలం ఆస్పత్రుల చుట్టూ తిరగాల్సి వచ్చింది. ఈ రోజుల్లో వైద్య ఖర్చులు భరించడం అంత ఈజీ కాదు. ఆ బిల్లులు చెల్లించడానికైనా మళ్లీ సినిమాలు చేయాల్సిందే! సినిమాలే కాదు.. యాక్టింగ్ పరంగా ఏ ప్రాజెక్టుల్లోనైనా నటిస్తాను.

పెళ్లి చేసుకోలేదు.. ఇప్పటివరకు నేను పెళ్లి చేసుకోలేదు. ఈ మధ్యకాలంలో విడాకులు పెరిగిపోతున్నాయి. అందుకే సరైన వ్యక్తి దొరికాకే వైవాహిక బంధంలో అడుగుపెట్టాలనుకుంటున్నాను. లేటుగా పెళ్లి చేసుకున్నా సరే ఆ బంధం జీవితాంతం కొనసాగేలా చూసుకుంటాను అని రేఖ వేదవ్యాస్ చెప్పుకొచ్చింది. తనకు వచ్చిన వ్యాధి ఏంటన్నది మాత్రం బయటపెట్టలేదు. తన అనారోగ్యానికి గల కారణాన్ని సస్పెన్స్‌గానే ఉంచింది.



# ‘కింగ్డమ్’ నా చేతుల్లోంచి వెళ్లిపోయింది.. ఆ నలుగురికి జై కొట్టిన విజయ్ దేవరకొండ

‘కింగ్డమ్’ మూవీలో ఎక్కువ సన్నివేశాలను శ్రీలంకలో చిత్రీకరించామని, దాదాపు 40 రోజుల పాటు అక్కడే షూటింగ్ చేశామని దర్శకుడు గౌతమ్ తిన్ననూరి చెప్పారు. విజయ్ దేవరకొండ కథానాయకుడిగా ఆయన దర్శకత్వంలో రూపొందిన స్పై యాక్షన్ థ్రిల్లర్ ఇది. భాగ్యశ్రీ బోర్సే కథానాయిక. సత్యదేవ్ కీలక పాత్ర పోషించారు. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ మూవీ జులై 31న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా దర్శకుడు సందీప్‌రెడ్డి వంగాతో కలిసి విజయ్ దేవరకొండ, గౌతమ్ తిన్ననూరి మాట్లాడారు. సినిమాకు సంబంధించిన ఆసక్తికర విషయాలను పంచుకున్నారు.

‘మళ్లీ రావా’ విజయ్‌తో చేయాల్సింది..

“140 రోజుల షూటింగ్‌లో 40 రోజులు శ్రీలంకలోనే షూటింగ్ జరిగింది. షూటింగ్ సమయంలో అక్కడ ఆర్మీ సహకారం బాగుంది. మాకు కావాల్సిన ఆర్మీ ట్యాంకర్లు, వెహికల్స్, ఇతర ఆయుధాలు వాళ్లే తీసుకొచ్చి ఇచ్చేవారు. రియల్ లొకేషన్స్‌లో షూట్ చేయడమంటే నాకు ఇష్టం. ఎందుకంటే, వీఎఫ్ఎక్స్‌తో నేను అనుకున్న విధంగా ఆ సీన్ రాకపోవచ్చు. తక్కువ వీఎఫ్ఎక్స్ ఉండేలా జాగ్రత్తలు తీసుకున్నా. ఫైట్స్ మాస్టర్స్‌కు కూడా స్క్రిప్ట్ చెప్పి.. మేము తీసే కథకు సరిపోయేలా మాత్రమే ఫైట్స్‌ను డిజైన్ చేయించి, అలాగే తీశాం. షూటింగ్ మొదలు పెట్టిన కొత్తలో ఏ సీన్ తీసినా, ఇది వర్కవుట్ అవుతుందా? లేదా? అని కాస్త భయం ఉండేది. 60 శాతం షూటింగ్ చేసిన తర్వాత ‘హమ్మయ్య’ అనుకున్నా. ఇక మూవీలో వచ్చే జైలు సీన్ సినిమాకు హైలైట్. అందులో 300 మందికి పైగా నటించారు. ‘పెళ్లి చూపులు’ విడుదల కాకముందే విజయ్‌ను కలిసి ‘మళ్లీ రావా’ కథను చెప్పా. అది వర్కవుట్ కాలేదు. మళ్లీ ఇన్నేళ్లకు ఈ సినిమాతో కలిశాం” అని దర్శకుడు గౌతమ్ తిన్ననూరి పంచుకున్నారు.

అన్నీ అనుకున్నట్లు జరగవు..: విజయ్ దేవరకొండ

“షూటింగ్ చేసేటప్పుడు నేను ప్రతి సీన్ ఆస్వాదిస్తూ చేస్తే.. ప్రేక్షకులకు నచ్చుతుందని అనుకునేవాడిని. ‘అర్జున్‌రెడ్డి’లాగే అన్నీ హిట్ అవుతాయని పందెం కాసేవాడిని. వేదికలపై డైలాగ్స్ చెప్పేవాడిని. కానీ, సినిమాలు చేస్తున్న కొద్దీ అర్థమైందేంటంటే, ఏది హిట్ అవుతుందో.. ఏది కాదో.. శుక్రవారం మూవీ విడుదలయ్యే వరకూ నాకే కాదు, ఎవరికీ తెలియదు. ఒక మూవీ విజయం సాధించాలంటే చాలా విషయాలు ప్రభావితం చేస్తాయి. దర్శకుడు చెప్పిన ఐడియా నచ్చితేనే సినిమా చేస్తా. ఈ రంగాన్ని గౌరవించే వాళ్లతో చేయడానికి ఇష్టపడతా. అందుకే ఒకరోజు గౌతమ్‌కు కాల్ చేసి, ‘నా దగ్గర కథేమీ లేదు. నువ్వు స్క్రిప్ట్ చెప్పు సినిమా చేద్దాం’ అన్నాను. ‘గ్యాంగ్‌స్టర్ బ్యాక్‌డ్రాప్‌లో ఇద్దరు బ్రదర్స్. వాళ్ల చుట్టూ జరిగే సంఘర్షణ’ అనే ఐడియా చెప్పాడు. బాగా నచ్చింది. గౌతమ్ ఎమోషన్స్‌ను ఎలా హ్యాండిల్ చేస్తాడో తెలుసు. అతడి మైండ్‌లో ఉన్న ఆలోచనను డెవలప్ చేసిన విధానం నచ్చింది. ప్రస్తుతం సినిమా నా చేతుల్లో నుంచి వెళ్లిపోయింది. ఇప్పుడు నేను జై గౌతమ్ (దర్శకుడు), జై అనిరుధ్ (సంగీత దర్శకుడు), జై నవీన్ నూలీ (ఎడిటర్), జై శ్రీరామ్ (దేవుడు) అంటున్నాను” అని విజయ్ దేవరకొండ పంచుకున్నారు.

# రూట్ రికార్డు శతకం.. భారీ ఆధిక్యంలో ఇంగ్లండ్

టీమిండియా-ఇంగ్లండ్ మధ్య నాలుగవ టెస్టు మూడో రోజు ఆట ముగిసింది. మాంచెస్టర్ వేదికగా శుక్రవారం నాటి ఆట పూర్తయ్యేసరికి ఇంగ్లండ్ ఏడు వికెట్ల నష్టానికి 544 పరుగుల భారీ స్కోర్ చేసింది. కెప్టెన్ బెన్ స్టోక్స్ 77, లియాం డాసన్ 21 పరుగులతో క్రీజులో ఉన్నారు. తొలి ఇన్నింగ్స్ లో టీమిండియా కంటే ఇంగ్లండ్ ప్రస్తుతం 186 పరుగుల ఆధిక్యంలో ఉంది.

**రూట్ రికార్డు శతకం:** మాంచెస్టర్ టెస్ట్‌లో ఇంగ్లండ్ భారీ ఆధిక్యం సాధించింది. 127 ఓవర్ల తర్వాత ఆ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 6 వికెట్ల నష్టానికి 523 పరుగులు చేసి, 165 పరుగుల ఆధిక్యంలో కొనసాగుతుంది. రూట్ రికార్డు శతకం (150) సాధించి ఇంగ్లండ్‌ను పటిష్ట స్థితికి చేర్చాడు. అతనికి స్టోక్స్ (66 రిటైర్డ్ హర్ట్) అండగా నిలిచాడు. క్రిస్ వోక్స్ (2), లియామ్ డాసన్ (7) క్రీజ్‌లో ఉన్నారు.



ఇంగ్లండ్ ఇన్నింగ్స్‌లో ఓపెనర్లు జాక్ క్రాలే (84), బెన్ డకెట్ (94), ఓలీ పోప్ (71) అర్ధ సెంచరీలతో సత్తా చాటగా.. హ్యారీ బ్రూక్ (3) ఒక్కడే నిరాశపరిచాడు. భారత బౌలర్లలో వాషింగ్టన్ సుందర్, రవీంద్ర జడేజా తలో 2 వికెట్లు తీయగా.. 2, అన్షుల్ కంబోజ్ ఓ వికెట్ పడగొట్టాడు.
అంతకుముందు భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 358 పరుగులకు ఆలౌటైంది. యశస్వి జైస్వాల్ 58, కేఎల్ రాహుల్ 46, సాయి సుదర్శన్ 61, శుభ్‌మన్ గిల్ 12, రిషబ్ పంత్ 54, రవీంద్ర జడేజా 20, శార్దూల్ ఠాకూర్ 41, వాషింగ్టన్ సుందర్ 27, అన్షుల్ కంబోజ్ 0, జస్ప్రీత్ బుమ్రా 5, మహ్మద్ సిరాజ్ 5 (నాటౌట్) పరుగులు చేశారు.



# ఫైనల్లో కోనేరు హంపి

**భారత్ ఖాతాలో మహిళల వరల్డ్ కప్ టైటిల్**
**తుది పోరులో దివ్య దేశ్‌ముఖ్‌తో హంపి 'ఢీ'**

**బతూమి (జార్జియా):** మహిళల ప్రపంచకప్ నాకౌట్ చెస్ టోర్నమెంట్ టైటిల్ తొలిసారి భారత్ ఖాతాలో చేరడం ఖరారైంది. బుధవారం భారత్‌కు చెందిన ప్రపంచ జూనియర్ చాంపియన్ దివ్య దేశ్‌ముఖ్ ఫైనల్‌కు చేరగా... గురువారం దివ్య సరసన భారత దిగ్గజం కోనేరు హంపి కూడా చేరింది. చైనా గ్రాండ్‌మాస్టర్ లె టింగ్జితో జరిగిన రెండో సెమీఫైనల్లోఆంధ్రప్రదేశ్‌కు చెందిన హంపి టైబ్రేక్‌లో 4-2 పాయింట్లతో... ఓవరాల్‌గా 5-3 పాయింట్లతో విజయాన్ని అందుకొని ఫైనల్‌కు చేరింది.
ఈ గెలుపుతో హంపి వచ్చే ఏడాది జరిగే క్యాండిడేట్స్ టోర్నీకి కూడా అర్హత సాధించింది. బుధవారం నిర్ణీత రెండు క్లాసికల్ గేమ్‌ల తర్వాత హంపి, లె టింగ్జి 1-1తో సమంగా ఉన్నారు. దాంతో విజేతను తేల్చేందుకు గురువారం టైబ్రేక్ గేమ్‌లు నిర్వహించారు. ముందుగా ర్యాపిడ్ ఫార్మాట్‌లో రెండు గేమ్‌లు జరిగాయి. అయితే ఈ రెండూ 'డ్రా'గా ముగిశాయి. దాంతో ఇద్దరూ 2-2తో సమంగా నిలిచారు. అనంతరం ర్యాపిడ్ ఫార్మాట్‌లోనే మరో రెండు గేమ్‌లు నిర్వహించారు.
తొలి గేమ్‌లో లె టింగ్జి 65 ఎత్తుల్లో నెగ్గగా... రెండో గేమ్‌లో హంపి 39 ఎత్తుల్లో గెలిచింది. దాంతో స్కోరు 3-3తో సమమైంది. ఈసారి వీరిద్దరి మధ్య బ్లిట్జ్ ఫార్మాట్‌లో రెండు గేమ్‌లు నిర్వహించారు. ఈ రెండు గేముల్లోనూ హంపి నెగ్గి ఫైనల్ బెర్త్‌ను ఖరారు చేసుకుంది. తొలి గేమ్‌లో హంపి 70 ఎత్తుల్లో, రెండో గేమ్‌లో 33 ఎత్తుల్లో గెలుపొందింది. హంపి, దివ్య మధ్య ఈనెల 26, 27వ తేదీల్లో ఫైనల్ జరుగుతుంది. రెండు గేమ్‌లలో ఫలితం తేలకపోతే 28న టైబ్రేక్ గేమ్‌లు నిర్వహించి విజేతను నిర్ణయిస్తారు. 2 ప్రపంచ చెస్ చాంపియన్‌షిప్‌లో టైటిల్ పోరుకు చేరడం హంపికిది రెండోసారి. 2011లో మ్యాచ్ ఫార్మాట్‌లో నిర్వహించిన ప్రపంచ చాంపియన్‌షిప్‌లో హంపి ఫైనల్ చేరి చైనా గ్రాండ్‌మాస్టర్ హు ఇఫాన్ చేతిలో ఓడిపోయింది.





# భారత్‌తో నాలుగో టెస్ట్.. రికార్డులు బద్దలు కొట్టడమే పనిగా పెట్టుకున్న జో రూట్

**మాంచెస్టర్ టెస్ట్ తొలి ఇన్నింగ్స్‌లో ఇంగ్లండ్ స్టార్ ఆటగాడు జో రూట్ రికార్డులు బద్దలు కొట్టడమే పనిగా పెట్టుకున్నాడు. తొలుత టెస్ట్‌ల్లో అత్యధిక పరుగులు చేసిన ఆటగాళ్ల జాబితాలో రాహుల్ ద్రవిడ్ (13288), జాక్ కల్లిస్‌ను (13289) అధిగమించి మూడో స్థానానికి ఎగబాకిన రూట్.. హాఫ్ సెంచరీ పూర్తి చేశాక టెస్ట్‌ల్లో అత్యధిక ఫిఫ్టి ప్లస్ స్కోర్లు చేసిన ఆటగాళ్ల జాబితాలో రికీ పాంటింగ్, జాక్ కల్లిస్‌ను దాటేసి రెండో స్థానానికి చేరాడు.**

**టెస్ట్‌ల్లో అత్యధిక ఫిఫ్టి ప్లస్ స్కోర్లు చేసిన టాప్-5 ఆటగాళ్లు..**
- సచిన్ టెండూల్కర్- 119
- జో రూట్- 104
- రికీ పాంటింగ్- 103
- జాక్ కల్లిస్- 103
- రాహుల్ ద్రవిడ్- 99

**టెస్ట్‌ల్లో అత్యధిక పరుగులు చేసిన టాప్-5 బ్యాటర్లు..**
- సచిన్ టెండూల్కర్- 15921
- రికీ పాంటింగ్- 13378
- జో రూట్- 13319*
- జాక్ కల్లిస్- 13289
- రాహుల్ ద్రవిడ్- 13288

మ్యాచ్ విషయానికొస్తే.. 225/2 స్కోర్ వద్ద మూడో రోజు ఆటను ప్రారంభించిన ఇంగ్లండ్ తొలి సెషన్‌లో ఒక్క వికెట్ కూడా కోల్పోకుండా మరో 107 పరుగులు జోడించింది. లంచ్ విరామం సమయానికి ఆ జట్టు స్కోర్ 332/2గా ఉంది. పోప్ 70, రూట్ 63 పరుగులతో క్రీజ్‌లో ఉన్నారు.
భారత తొలి ఇన్నింగ్స్ స్కోర్‌కు ఇంగ్లండ్ ఇంకా 26 పరుగులు మాత్రమే వెనుకపడి ఉంది. పోప్, రూట్‌కు ముందు ఓపెనర్లు జాక్ క్రాలే (84), బెన్ డకెట్ (94) కూడా అర్ధ సెంచరీలు సాధించారు. క్రాలే వికెట్ జడేజాకు.. డకెట్ వికెట్ అన్షుల్ కంబోజ్‌కు దక్కింది.

అంతకుముందు భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 358 పరుగులకు ఆలౌటైంది. యశస్వి జైస్వాల్ 58, కేఎల్ రాహుల్ 46, సాయి సుదర్శన్ 61, శుభ్‌మన్ గిల్ 12, రిషబ్ పంత్ 54, రవీంద్ర జడేజా 20, శార్దూల్ ఠాకూర్ 41, వాషింగ్టన్ సుందర్ 27, అన్షుల్ కంబోజ్ 0, జస్ప్రీత్ బుమ్రా 5, మహ్మద్ సిరాజ్ 5 (నాటౌట్) పరుగులు చేశారు.

ఇంగ్లండ్ బౌలర్లలో బెన్ స్టోక్స్ 5 వికెట్లతో చెలరేగగా.. జోఫ్రా ఆర్చర్ 3 వికెట్లు తీశాడు. వోక్స్, డాసన్ తలో వికెట్ పడగొట్టారు. ఐదు మ్యాచ్‌ల ఈ సిరీస్‌లో ప్రస్తుతం ఇంగ్లండ్ 21 ఆధిక్యంలో ఉన్న విషయం తెలిసిందే.

# 32 ఏళ్లకే రిటైర్మెంట్ ప్రకటించిన టీమిండియా ప్లేయర్

**భారత మహిళా క్రికెటర్ వేద కృష్ణమూర్తి 32 ఏళ్ల వయసులోనే అంతర్జాతీయ క్రికెట్‌లోని అన్ని ఫార్మాట్లకు రిటైర్మెంట్ ప్రకటించింది. రిటైర్మెంట్ నిర్ణయాన్ని వేద ఇవాళ (జులై 25) సోషల్‌మీడియా వేదికగా పంచుకుంది. రైట్ హ్యాండ్ బ్యాటర్, అకేషనల్ లెగ్ స్పిన్ బౌలర్ అయిన వేద 2011లో టీమిండియా అరంగేట్రం చేసింది.**




అప్పటి నుంచి తొమ్మిదేళ్ల పాటు భారత జట్టుకు ప్రాతినిథ్యం వహించి 48 వన్డేలు, 76 టీ20లు ఆడింది. ఇందులో 10 హాఫ్ సెంచరీల సాయంతో 1704 పరుగులు చేసి 3 వికెట్లు తీసింది. వేద భారత మహిళా జట్టు రన్నరప్‌గా నిలిచిన 2017 వన్డే వరల్డ్‌కప్, 2020 టీ20 వరల్డ్‌కప్ జట్లలో సభ్యురాలిగా ఉంది.

కర్ణాటకలోని కదూర్ అనే చిన్న పట్టణం నుంచి వచ్చిన వేద టీమిండియా సాధించిన అనేక విజయాల్లో కీలక సభ్యురాలిగా ఉంది. వేద తన రిటైర్మెంట్ సందేశంలో తనకు సహకరించిన కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, కోచ్‌లు, మెంటర్లు, సహచర క్రికెటర్లు, కెప్టెన్లకు పేరు పేరున కృతజ్ఞతలు తెలిపింది. అలాగే తనకు అవకాశమిచ్చిన బీసీసీఐ, కర్ణాటక క్రికెట్ బోర్డు, రైల్వేస్ క్రికెట్ బోర్డుకు కూడా ధన్యవాదాలు తెలిపింది.వేద దేశవాలీ క్రికెట్‌లో కర్ణాటక, రైల్వేస్ జట్లకు నాయకత్వం వహించింది. వేద చివరిగా 2020 టీ20 వరల్డ్‌కప్ ఫైనల్లో టీమిండియాకు ప్రాతినిథ్యం వహించింది. అంతకు రెండేళ్ల ముందు (ఏప్రిల్, 2018) భారత్ తరఫున తన చివరి వన్డే ఆడింది. వేదకు అత్యంత చురుకైన ఫీల్డర్‌గా పేరుంది. మహిళల టీ20ల్లో ఆమె సంయుక్తంగా అత్యధిక క్యాచ్‌లు పట్టుకున్న నాన్ వికెట్‌కీపర్‌గా కొనసాగుతుంది.
గత కొంతకాలంగా జాతీయ జట్టు అవకాశాలు రాకపోవడంతో వేద వ్యాఖ్యాతగా వ్యవహరిస్తుంది. వేద మహిళల ఐపీఎల్ రెండో సీజన్‌లో (2024) గుజరాత్ జెయింట్స్ తరఫున ఆడింది. ఆ సీజన్‌లో చెప్పుకోదగ్గ ప్రదర్శనలు (4 ఇన్నింగ్స్‌ల్లో కేవలం 22 పరుగులు) చేయకపోవడంతో ఆమెను తదుపరి సీజన్‌లో ఏ ఫ్రాంచైజీ తీసుకోలేదు. వేద మహిళల బిగ్‌బాష్‌లీగ్‌లో కూడా ఆడింది. 201718 సీజన్‌లో ఆమె హోబర్ట్ హరికేన్స్‌కు ప్రాతినిథ్యం వహించింది.





# సింధుకు షాక్

**ఉన్నతి చేతిలో అనూహ్య ఓటమి**
**ముగిసిన ప్రణయ్ పోరాటం**
**క్వార్టర్ ఫైనల్లో సాత్విక్-చిరాగ్ జోడీ**

**చాంగ్జౌ:** ఈ ఏడాది మరో టోర్నమెంట్‌లో భారత స్టార్, ప్రపంచ మాజీ చాంపియన్ పీవీ సింధు నిరాశ పరిచింది. చైనా ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-1000 బ్యాడ్మింటన్ టోర్నీలో సింధు కథ ప్రిక్వార్టర్ ఫైనల్లోనే ముగిసింది. అనూహ్యంగా ఈసారి భారత రైజింగ్ స్టార్, హరియాణాకు చెందిన ఉన్నతి హుడా చేతిలో సింధు ఓడిపోవడం గమనార్హం. గురువారం జరిగిన మహిళల సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో ప్రపంచ 15వ ర్యాంకర్ సింధు 16-21, 21-19, 13-21తో ప్రపంచ 35వ ర్యాంకర్, 17 ఏళ్ల ఉన్నతి హుడా చేతిలో ఓటమి పాలైంది. 73 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సింధుకు ఆద్యంతం గట్టిపోటీ ఎదురైంది.

తొలి గేమ్‌లో పలుమార్లు ఇద్దరి స్కోర్లు సమమయ్యాయి. స్కోరు 13-13 వద్ద వరుసగా మూడు పాయింట్లు నెగ్గిన ఉన్నతి 16-13తో ఆధిక్యంలోకి వెళ్లింది. ఆ తర్వాత ఉన్నతి ఒక పాయింట్ కోల్పోయి, వెంటనే వరుసగా నాలుగు పాయింట్లు గెలిచి 20-14తో ముందంజ వేసింది. సింధు రెండు పాయింట్లు నెగ్గిన తర్వాత మరో పాయింట్ చేజార్చుకొని తొలి గేమ్‌ను కోల్పోయింది. రెండో గేమ్‌లోనూ ఇద్దరూ ప్రతి పాయింట్‌కూ నువ్వా నేనా అన్నట్లు పోరాడారు. గత ఏడాది సయ్యద్ మోదీ ఓపెన్ టోర్నీలో సింధు చేతిలో వరుస గేముల్లో ఓడిన ఉన్నతి ఈసారి మాత్రం అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకుంది.
స్కోరు 19-19 వద్ద సింధు రెండు పాయింట్లు నెగ్గి గేమ్‌ను దక్కించుకొని మ్యాచ్‌లో నిలిచింది. నిర్ణాయక మూడో గేమ్‌లో ఆరంభంలోనే ఉన్నతి 9-5తో ఆధిక్యంలోకి వెళ్లింది. ఆ తర్వాత ఈ ఆధిక్యాన్ని 15-9కు పెంచుకుంది. స్కోరు 16-13 వద్ద ఉన్నతి ఒక్కసారిగా చెలరేగి వరుసగా ఐదు పాయింట్లు గెలిచి గేమ్‌తోపాటు చిరస్మరణీయ విజయాన్ని అందుకుంది. నేడు జరిగే క్వార్టర్ ఫైనల్లో రెండుసార్లు ప్రపంచ చాంపియన్ అకానె యామగుచి (జపాన్)తో ఉన్నతి ఆడుతుంది.



అంతర్జాతీయ టోర్నీల్లో భారత క్రీడాకారిణి చేతిలో సింధు ఓడిపోవడం 2018 తర్వాత ఇదే తొలిసారి. 2018 కామన్వెల్త్ గేమ్స్ ఫైనల్లో సైనా చేతిలో సింధు ఓటమి పాలైంది. 2019 జాతీయ చాంపియన్‌షిప్ ఫైనల్లోనూ సైనా చేతిలోనే సింధు పరాజయం పాలైంది. ఈ ఏడాది సింధు ఇండియా ఓపెన్, ఇండోనేసియా మాస్టర్స్, ఆల్ ఇంగ్లండ్ చాంపియన్‌షిప్, స్విస్ ఓపెన్, ఆసియా చాంపియన్‌షిప్, మలేసియా మాస్టర్స్, సింగపూర్ ఓపెన్, ఇండోనేసియా ఓపెన్, జపాన్ ఓపెన్ టోర్నీలలో ఆడింది. జనవరిలో స్వదేశంలో జరిగిన ఇండియా ఓపెన్‌లో క్వార్టర్ ఫైనల్ చేరడమే ఈ ఏడాది సింధు అత్యుత్తమ ప్రదర్శన కావడం గమనార్హం.

పురుషుల సింగిల్స్‌లో భారత పోరాటం ముగిసింది. భారత మూడో ర్యాంకర్ హెచ్‌ఎస్ ప్రణయ్ ప్రిక్వార్టర్ ఫైనల్లో వెనుదిరిగాడు. ఆరో సీడ్ చౌ తియెన్ చెన్ (చైనీస్ తైపీ)తో జరిగిన మ్యాచ్‌లో ప్రణయ్ 21-18, 15-21, 8-21తో ఓడిపోయాడు. తొలి గేమ్‌ను నెగ్గిన ప్రణయ్ అదే జోరును కొనసాగించలేకపోయాడు. వరుసగా రెండు గేమ్‌లను కోల్పోయి ఓటమి పాలయ్యాడు. పురుషుల డబుల్స్ విభాగంలో సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి (భారత్) జోడీ క్వార్టర్ ఫైనల్ చేరుకుంది. ప్రిక్వార్టర్ ఫైనల్లో సాత్విక్-చిరాగ్ ద్వయం 21-19, 21-19తో ఎనిమిదో సీడ్ లియో రాలీ కర్నాండో-బగాస్ మౌలానా (ఇండోనేసియా) జోడీపై విజయం సాధించింది.
సింధుపై గెలుస్తానని అస్సలు ఊహించలేదు. తుది ఫలితం గురించి ఆలోచించకుండా నా అత్యుత్తమ ప్రదర్శన ఇవ్వాలనే లక్ష్యంతో బరిలోకి దిగాను. మొత్తానికి సింధుపై నెగ్గడం నాకే ఆశ్చర్యమనిపిస్తోంది. మ్యాచ్‌లో నేను రెండుసార్లు హాక్ ఐ చాలెంజ్‌లను వృథా చేసుకున్నాను. చివరకు నా వద్ద అప్పీల్ చేసుకునేందుకు మరో అవకాశం లేకపోవడంతో కాస్త అసహనం కలిగింది. అయితే నిర్ణాయక మూడో గేమ్‌లో సంయమనం కోల్పోకుండా ఆడి విజయం అందుకున్నాను.